

కలెక్టరేట్ వద్ద సిద్ధమైన అన్న క్యాంటీన్

పేదోడికి పట్టెడన్నం

నేటి నుంచే ఏలూరులో నాలుగు చోట్ల అన్నక్యాంటీన్లు ప్రారంభం

పేదోడి పట్టెడన్నం పెట్టే మహత్కార్యాన్ని గడిచిన ఐదేళ్లల్లో జగన్ సర్కార్ కాలరాసింది. ఈ మహత్కార్యానికి కూడా రాజకీయ రంగు పులిమింది. మిట్ట మధ్యాహ్నం నాలుగు మెతుకులు తినే సౌకర్యాన్ని కొనసాగించాలని పేదలు ప్రాధేయపడినా, అభ్యర్థించినా ఆనాడు ససేమిరా వీలు లేదన్నారు. గడిచిన ఎన్నికల్లో పేదలు జగన్ సర్కార్‌ను మట్టి కరిపించి కూటమికి అధికారం ఇచ్చారు. దీంతో ఇక జిల్లాల వారీగా యథావిధిగానే అన్నక్యాంటీన్లలో ఐదు రూపాయలకే అల్పాహారం, భోజనం అందించడానికి నేడు మరోసారి శ్రీకారం చుడుతున్నారు.

- ఐదు రూపాయలకే అల్పాహారం లేదా భోజనం
- ప్రతీ క్యాంటీన్‌లోనూ రోజూ 350 మందికి అనువుగా ఏర్పాట్లు
- పేదలకు గొప్ప వరమంటూ కూటమి పక్షాల హర్షం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

అన్న క్యాంటీన్.. ఈ పేరు వింటేనే పేదల హృదయం ఉప్పొంగుతుంది. ఆకలి దప్పులతో అలమటించే పేదలకు తక్కువ ఖర్చుతో కడుపు నింపే మహత్కార్యం మళ్లీ కళ్ళెదుట నేటి నుంచే సాక్షాత్కారం కానుంది. పేదల సంక్షేమంలో భాగంగా అన్నక్యాంటీన్లను తిరిగి పునరుద్ధరించి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి నాణ్యతగల భోజనం ఐదు రూపాయలకే అందించడానికి కూటమి ప్రభుత్వం సంకల్పించింది. దీనిలో భాగంగానే ఏలూరు జిల్లా కేంద్రంలో కలెక్టరేట్, ఆర్‌ఆర్‌పేట వేంకటేశ్వరస్వామి గుడి వద్ద, తంగెళ్లమూడి, బాలాజీ థియేటర్ వద్ద నాలుగు చోట్ల పేదలకు అన్నక్యాంటీన్ల ద్వారానే ఉచిత భోజనం అందించే కార్యక్రమానికి గురువారం శ్రీకారం చుట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. ఇప్పటికే పాత అన్నక్యాంటీన్లను మరమ్మతులు చేసి పేదలకు భోజనం వడ్డించేందుకు వీలుగా తీర్చిదిద్దారు. నగరంలో గడిచిన ఐదేళ్లుగా అన్నక్యాంటీన్లు మూతపడినా స్థానిక టీడీపీ నేత, ప్రస్తుత ఎమ్మెల్యే బడేటి చంటి నాయకత్వాన నిర్విరామంగా ఫైర్‌స్టేషన్‌సెంటర్‌లో దాతల సహకారంతో మధ్యాహ్నం ఉచిత అన్నదానం చేస్తూ వచ్చారు.

రోజుకి ఒక్కొక్క క్యాంటీన్‌లో 350 మందికి..

ప్రతీరోజూ ఒక్కో అన్నక్యాంటీన్‌లో 350 మందికి అల్పాహారం, భోజనం అందించాలని నిర్ణయించారు. ఈ లెక్కన నగరంలో ప్రతీరోజూ 1400 మందికి తగ్గకుండా అల్పాహారం, భోజనం అందించడానికి ప్రస్తుతానికి ఏర్పాట్లు చేశారు. కనీస చార్జి ఐదు రూపాయలతోనే ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందించేందుకు అక్షయ పాత్ర సంస్థతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఉదయం నగరంలోని నాలుగు అన్న క్యాంటీన్లలో వారానికి రెండు రోజులు ఇడ్లీ, మరో రెండు రోజులు పూరి, ఇంకో రెండు రోజులు పొంగలి అందిస్తారు. మధ్యాహ్నం, రాత్రి భోజనంలో అన్నం, పప్పు, కూర, పచ్చడి, పెరుగుతో భోజనాన్ని పేదలకు అందిస్తారు. వాస్తవానికి జిల్లా వ్యాప్తంగా తొలి దశలో కేవలం నాలుగు క్యాంటీన్లు మాత్రమే అందుబాటులోకి తెస్తున్నా దశల వారీగా ఈ క్యాంటీన్ల సంఖ్యను మరింత విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది.



ఆర్‌ఆర్‌పేట వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద సిద్ధమైన అన్న క్యాంటీన్

పేదలకు ఓ గొప్ప వరమే

అల్పాదాయ మధ్యతరగతి వర్గాలు ఎక్కువ మంది ఏలూరు నగరానికి ప్రతీరోజూ ఏదొక పని మీద వస్తూ పోతుంటారు. వీరితో పాటు నగరంలో వివిధ దుకాణాల్లో పనిచేసే అల్పాదాయ వర్గాలకు సైతం అన్యక్యాంటీన్లు ఆదరువు అవుతాయని భావిస్తున్నారు. నగరంలో ఏం కొనాలన్నా, తినాలన్నా సామాన్యుడి వల్ల కావడం లేదు. బయట భోజనం హోటళ్లల్లో ప్లేటు భోజనం రూ.వంద, ఫుల్‌మీల్స్ అయితే రూ.125 నుంచి రూ.140 వరకు ధర ఉంది. అల్పాహారం ఏదైనా పెద్ద హోటళ్ళల్లో రూ.40 రూపాయలకు పైబడే. రోడ్డుపక్కన క్యాంటీన్లు, తోపుడు బండ్ల మీద ఎలా లేదన్నా రూ.20లకుపైబడే ధర పలుకుతోంది. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ అన్నక్యాంటీన్లు పునః ప్రారంభం కావడం నిజంగా పేదలకు గొప్ప వరంగానే భావిస్తున్నామని ఎమ్మెల్యే బడేటి చంటి వ్యాఖ్యానించారు. కూటమిలోని జనసేన, బీజేపీలు కూడా అన్నక్యాంటీన్ల ప్రారంభాన్ని స్వాగతించాయి. పేదల సంక్షేమంలో భాగంగానే కూటమి ప్రభుత్వం తిరిగి ఈ క్యాంటీన్ల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవడం పూర్తిగా అభినందనీయమని పేర్కొన్నారు. ఏలూరు నగరంలోని నాలుగు క్యాంటీన్లను అట్టహాసంగా ప్రారంభించాలని నిర్ణయించారు.

20వ తేదీ నుంచి పశువులకు టీకాలు

- పశుసంవర్ధక శాఖ డీడీ డాక్టర్ గోవిందరాజు

ఏలూరు టూటౌన్, ఆగస్టు 14 : పశువులకు వ్యాధి నివారణ కోసం పుట్టగానే రైతులు టీకాలు వేయించుకోవాలని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ గోవిందరాజు తెలిపారు. పశుసంవర్ధక శాఖ జేడీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఆగస్టు 20వ తేదీ నుంచి సెప్టెంబరు 20వ తేదీ వరకు పశువులకు గాలికుంటువ్యాధి, దొమ్మవ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్టు తెలిపారు. మూడు నెలలు పైబడిన లేగదూడలకు బ్రుసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నామన్నారు. దెందులూరు, గోపన్నపాలెంలో పశువుల ఇంటిగ్రిటీ లేబరేటరీ ఉందన్నారు. అక్కడకు పశువుల పేడ, రక్త పరీక్షలు, గర్భాశయ ద్రవాల పరీక్షలు, పొదుగ వాపు వ్యాధుల పరీక్షలు నిర్వహించి రోగనిర్ధారణ చేస్తామన్నారు. అవసరమైన మందులను యాంటీబయోటిక్స్‌ను అందిస్తామన్నారు.

ఆది, సోమ వారాల్లో సికింద్రాబాద్‌కు ప్రత్యేక రైలు

నరసాపురం, అగస్టు 14: ప్రయాణికుల రద్దీని పరిగణలోకి తీసుకుని నరసాపురం సికింద్రాబాద్‌ల మధ్య ఆది, సోమవారాల్లో ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు ఎస్ఎం మధుబాబు చెప్పారు. 07169 నంబర్‌తో ఆదివారం రాత్రి 8గంటలకు నరసాపురంలో ఈప్రత్యేక రైలు బయలుదేరుతుంది. పాలకొల్లు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, నల్లగొండ మీదుగా ఉదయం 5గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. తిరిగి అదే రోజు 07170 నంబర్‌తో రాత్రి 8.30గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5గంటలకు చేరుకుంటుందని ఎస్ఎం చెప్పారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



విజిలెన్స్ దాడి

ముసునూరులో ఎరువులు, నిషేధిత కలుపు మందు సీజ్ 9



విద్యుత్ కాంతులతో కలెక్టరేట్

పంద్రాగస్టు వేడుకలకు.. సర్వం సిద్ధం

- నేడు పరేడ్ గ్రౌండ్‌లో మంత్రి కొలుసు జెండా ఆవిష్కరణ
- పోలీసులు పకడ్బందీ ఏర్పాట్లు

ఏలూరు క్రైం/ఏలూరుసిటీ ఆగస్టు 14 : 78వ స్వాతంత్ర్య వేడుకలను వైభవంగా నిర్వహించడానికి జిల్లా అధికార యంత్రాంగం సర్వసిద్ధం చేశారు. జిల్లా వేడుకలు ఏలూరులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్నారు. రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి జాతీయ జెండాను ఎగురవేయనున్నారు. ప్రజాప్రతినిధులు, కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ ప్రతాప్‌కిషోర్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తమకుమార్, జేసీ ధాత్రిరెడ్డి, ఇతర అధికారులు పాల్గొననున్నారు. ఇప్పటికే పోలీస్ పరేడ్ గ్రౌండ్ చుట్టూ ప్రత్యేక పోలీసు భద్రత చర్యలు ఏర్పాటు చేసి గ్రౌండ్‌కు వెళ్లే అన్ని మార్గాలను ప్రత్యేక పోలీసులు తమ ఆధీనంలోకి తీసేసుకున్నారు. స్వాతంత్ర్య వేడుక లకు వచ్చే ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా మెటల్ డిటెక్టర్లతో తనిఖీలు చేయనున్నారు. వివిధ కేటగిరిల వారీగా గ్యాలరీలను ఏర్పాటు చేశారు. గ్రౌండ్, ముందు భాగాలను జాతీయ జెండాల ముగ్గులతో సుందరంగా తీర్చిదిద్దారు.

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

స్వాతంత్య వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో గురువారం నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను బుధవారం కలెక్టర్‌తో పాటు ఎస్పీ ప్రతాప్ శివకిషోర్ పరిశీంచారు. వేదిక ఏర్పాట్లు, స్టాల్స్ ఏర్పాట్లను వారు పరిశీలించారు. సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర గృహ నిర్మాణ , సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి హజరు కానున్నారని కలెక్టర్ తెలిపారు. ఉదయం 8.45 గంటలకు ముఖ్య అతిథి మంత్రి కొలుసు రాక, 9గంటలకు మంత్రి జాతీయ పతాక ఆవిష్కరణ, 9.05 గంటలకు గౌరవ వందనం స్వీకరణ, పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ సందర్శన , 9.15 గంటలకు ముఖ్య అతిథి సందేశం, 9.30 గంటలకు పోలీస్ కవాతు , 10 గంటలకు వివిధ శాఖల ప్రగతి శకటాల ప్రదర్శన , 10.20 గంటలకు వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శన , ఉదయం 10.40 గంటలకు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, 11.15 గంటలకు ప్రశంసా పత్రాలు ప్రదానం, 11.45 గంటలకు జాతీయ గీతాలాపన కార్యక్రమాలు ఉంటాయని కలెక్టర్ తెలిపారు.



ఏలూరులో తిరంగా ర్యాలీ

ఏలూరులో బుధవారం తిరంగా ర్యాలీ ఘనంగా జరిగింది. జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన అనంతరం ప్రజా ప్రతినిధులతో కలిసి కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్, జేసీ ధాత్రిరెడ్డి మోటారు సైకిళ్లతో ఇండోర్ ఆడిటోరియం నుంచి ఓవర్ బ్రిడ్జి వరకు ర్యాలీలో పాల్గొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సూచనలు మేరకు హర్‌ఘర్ తిరంగా ర్యాలీ కనుల పండువగా జరిగింది. ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజు, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు, కలెక్టర్, జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రపంచంలో ఏ దేశంలో లేని యువత మన దేశంలో ఉందని ప్రతి ఒక్క యువత దేశభక్తిని పెంపొందించుకోవాలని అన్నారు. డీఎస్పీ శ్రావణ్‌కుమార్, త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ కాగితం శ్రీనివాసరావు, టూటౌన్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ఆది ప్రసాద్, ఎస్ఐలు పోలీసు సిబ్బంది, ఇతర డిపార్టుమెంట్ల అధికారులు పాల్గొన్నారు.

సీఎస్ వీడియో కాన్ఫరెన్స్

ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ కోరారు. జాతీయ సమైక్యతను చాటి చెప్పేలా ప్రతి పౌరుడు తన ఇంటిపైన మువ్వెన్నల జెండాను ఎగురవేయాలని కోరారు. బుధవారం ఈ మేరకు కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ మంగళవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించుకున్నామని బుధవారం బైక్ ర్యాలీని నిర్వహించుకుంటున్నా మన్నారు. జిల్లాలో జాతీయ జెండాతో సెల్ఫీలు తీసుకుని సంబంధిత వెబ్‌సైట్ లో నమోదు చేయాలన్నారు. డీఆర్వో పుష్పమణి, జడ్పీ సీఈవో కేఎస్ఎస్ సుబ్బారావు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఏలూరు పరేడ్ గ్రౌండ్‌లో ముస్తాబవుతున్న వేదిక

దేశభక్తి పెంపొందించేలా హర్ ఘర్ తిరంగా : మంత్రి కొలుసు



ప్రతి భారతీయుని దేశ భక్తి పెపొందించేలా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలను జిల్లాలో స్ఫూర్తి వంతంగా నిర్వహించుకుంటున్నామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన హర్ ఘర్ తిరంగా సెల్ఫీ పాయింట్ వద్ద మంత్రి సెల్ఫీ దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఈనెల 9వతేదీ నుంచి 15వ తేదీ వరకు ఘనంగా నిర్వహించుకుంటున్నామన్నారు. జిల్లా యంత్రాంగంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, యువత భాగస్వాములు కావాలని దేశ సమగ్రతను కాపాడే ఈ మహోత్సవంలో ప్రతి ఒక్కరు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని దేశ భక్తి పెంపొందించాలని పిలుపునిచ్చారు.



పరేడ్‌గ్రౌండ్‌లో బుధవారం రాత్రి ముగ్గులు వేస్తున్న మహిళలు

గవర్నర్ ఎట్ హోం కార్యక్రమానికి శ్రీనివాసరెడ్డికి ఆహ్వానం



ఏలూరు రూరల్, ఆగస్టు 14 : స్వాతంత్ర్య దినోత్సవం రోజు వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న వారి గౌరవార్థం రాష్ట్ర రాజభవన్‌లో గవర్నర్ నిర్వహిస్తున్న ఎట్ హోమ్ కార్యక్రమానికి దొండపాడులోని పరివర్తన్ ప్రత్యేక దివ్యాంగుల పాఠశాల ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డికి ఆహ్వానం అందింది. ఈ కార్యక్రమానికి మొత్తం 19 మందిని ఆహ్వానించారు. గురువారం సాయంత్రం 4 గంటలకు రాజభవన్‌కు చేరుకోవాలని, రాజభవన్‌కు పంపిన ఆహ్వానపత్రంలో పేర్కొన్నారు. పరివర్తన్ పాఠశాల ద్వారా దివ్యాంగులకు చేస్తున్న సేవలను గుర్తించి శ్రీనివాసరెడ్డిని ఎంపిక చేసి ఆహ్వానం పంపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి బుధవారం జిల్లా కలెక్టర్ వెట్రిసెల్విని కలిశారు. గవర్నర్ కార్యక్రమానికి తనను ఆహ్వానించడం చాలా ఆనందంగా ఉందని ఆయన తెలిపారు.

'సర్దుబాటు'.. సడలింపులు

- 927కి తగ్గిన సర్‌ప్లస్ టీచర్లు
- మరికొందరికి మినహాయింపులు

ఏలూరు అర్బన్, ఆగస్టు 14 : క్షేత్రస్థాయిలో టీచర్ల వర్క్ అడ్జస్ట్‌మెంట్‌పై క్రమేణా అభ్యంతరాలు వస్తుండడంతో సమస్యలను పరిష్కరించేదిశగా ప్రభుత్వం కొంత పట్టువిడుపు ధోరణితో వ్యవహరిస్తూ మరికొన్ని సడలింపులు నిచ్చింది. దీంతో ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియ ఇక వేగవంతమవుతుందని భావిస్తున్నారు. విద్యాశాఖ అధికారులు బుధవారం నిర్వహించిన సమావేశంలో ఉపాధ్యాయ సంఘాలు పలు అభ్యంతరాలను లేవనెత్తగా, వాటి కొన్నింటిని పరిష్కరించేదిశగా ఒకట్రెండు రోజుల్లో సవరణలతో కూడిన మార్గదర్శకాలను జారీ చేయనున్నారు. ఇప్పటికే కొన్ని కేటగిరీల టీచర్లకు వర్క్ అడ్జస్ట్‌మెంట్ నుంచి మినహాయింపులు ఇవ్వగా, వీటి అనంతరం ఏలూరు జిల్లాలో మిగులు (సర్‌ప్లస్) టీచర్ల సంఖ్య 968 నుంచి తాజాగా 927కి తగ్గింది. వీరిలో ఎస్జీటీలు 654 మంది, స్కూల్ అసిస్టెంట్లు 273 మంది ఉన్నారు. అయితే సర్‌ప్లస్ టీచర్లందరికీ సర్దుబాటు ఉండకపోవడంతోపాటు, కౌన్సెలింగ్ అనంతరం కనీసం వందల సంఖ్యలోనే మిగులు ఉపాధ్యాయులు ప్రస్తుత పాఠశాలల్లోనే పనిచేసేందుకు వెనక్కివెళ్ళే అవకాశాలుండటం మండల స్థాయిల్లో 'కొరత' గణాంకాలను బట్టి కొంత ఊరటనిచ్చే అంశంగా చెప్పవచ్చు. ఆ మేరకు సవరించిన సర్‌ప్లస్ టీచర్ల జాబితాలను బుధవారం మండలాల ఎంఈవోల లాగిన్‌లకు పంపారు. ఈ జాబితాల్లో ఇంకా ఏవైనా చేరికలు, తొలగింపులుంటే నిర్ణీత ప్రొఫార్మాలో వెంటనే తెలపాలని ఆదేశించారు. ఈ క్రమంలో కొందరు సీనియర్లు కొరతవున్న పాఠశాలలకు సర్దుబాటు అయ్యేందుకు తమ అంగీకారాన్ని ఎంఈవోలకు అందజే శారు. తుది సీనియార్టీ జాబితాలను పంపిస్తామ ని, మండలాల వారీగా కొరతవున్న పాఠశాలలకు సర్‌ప్లస్ టీచర్లను కౌన్సె లింగ్ ద్వారా సర్దుబాటు చేసిన అనంతరం మిగిలిన సర్‌ప్లస్ టీచర్లను డివిజన్ పరిధిలోకి చేర్చి అక్కడకూడా మిగులు ఉపాధ్యాయుల సర్దుబాటు అవసరం లేకపోతే అటువంటి వారిని ఆయా మండలాల్లో ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాలలకే వెనక్కి పంపాలని ఆదేశిం చారు. ఈ నెలాఖరులో రిటైరయ్యే ఉపాధ్యాయులను, 70 శాతం అంగవైకల్యం వున్న టీచర్లను మినహాయించి వారి స్థానంలో తదుపరి జూనియర్‌ను సర్‌ప్లస్ జాబితాలో చేర్చాలని సూచించారు. సీనియార్టీని పరిగణించేటప్పుడు మెరిట్ కం రోస్టర్, ర్యాంకు ద్వారా నిర్ణయిస్తారు. ఇంకా ఎవరి నుంచైనా అభ్యంతరాలువస్తే వాటినికూడా పరిష్కరించిన తర్వాతే వర్క్ అడ్జస్ట్‌మెంట్‌ను చేపట్టే అవకాశం ఉన్నందున పని సర్దుబాటు పూర్తికావడానికి మరికొన్ని రోజులు పడుతుందని భావిస్తున్నారు.



ఉపాధ్యాయుల సమస్యలపై సమావేశమైన జడ్పీ సీఈవో, ఉపాధ్యాయ నాయకులు

సర్‌ప్లస్ జూనియర్లకు భలే చాన్స్

పని సర్దుబాటుకు ప్రామాణికంగా తీసుకునే స్కూలు/సబ్జెక్టు జూనియర్లతో కూడిన సీనియార్టీ జాబితాలు తయారయ్యాయి. కౌన్సెలింగ్‌లో ఈ జాబితాల్లోని సీనియర్లనే ముందుగా సర్దుబాటు చేస్తారు. ఆ ప్రకారం మండలంలో కొరతవున్న పాఠశాలలకు టీచర్ల సర్దుబాటు ముగిసిన తర్వాత మిగతా ఉపాధ్యాయులందరూ ప్రస్తుత పాఠశాలలకే వెనక్కి వెళతారని చెబుతున్నారు. దీంతో జాబితాల్లో చివరనవున్న జూనియర్లకు సంబంధిత పాఠశాలల్లోనే ఉండేందుకు చాన్స్ ప్రస్తుతానికి లభించనుందని తెలుస్తోంది. జాబితాల్లోని సీనియర్లకు మాత్రం స్థానభ్రంశం తప్పదు. ఇక తదుపరి రోజుల్లో ఇలా మిగిలిపోయిన జూనియర్లను డివిజన్ స్థాయిలో కొరతవున్న పాఠశాలలకు సర్దుబాటు చేసే అవకాశాలున్నాయి.

జీతాలు తీసుకుంటారు.. విధులకు హాజరుకారు..!

- బినామీలతో పనులు.. పై అధికారులకు ముడుపులు
- నగరపాలక సంస్థలో కొందరు ఉద్యోగుల తీరుపై వెల్లువెత్తుతున్న ఆరోపణలు

ఏలూరు టూటౌన్, ఆగస్టు 14 : జీతాలు తీసుకుంటారు.. కాని విధులకు హాజరుకారు. బినామి వర్కర్లతో పను లు చేయిస్తుంటారు. కొందరు పైఅధి కారులు ముడుపులు తీసు కుంటూ ఈ చోద్యం చూస్తున్నారు. ఇది నగరపాలక సంస్థలో జరుగుతున్న తంతు. నగర పాలక సంస్థలో ఇంజనీరింగ్ విభాగం, ప్రణాళిక విభాగం, పారిశుధ్య విభాగంలో, కాంట్రా క్టు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికుల్లో చాలామంది విధులకు వచ్చి హాజరు వేసి వెళ్లిపోతుంటారు. వారి స్థానం లో బినామి వర్కర్లతో పని చేయిస్తుంటారు. పర్మినెంట్ ఉద్యోగులకు రూ.50 వేలు నుంచి రూ.లక్ష వరకు జీతాలు అందుతుంటాయి. వీరిలో కొంతమంది తమ పై అధికారులకు నెలకు రూ.10 - 15 వేలు సమర్పించుకుంటారని, బినామి ఉద్యోగికి రూ.10వేలు ఇస్తుంటారనే ఆరోపణలు ఉన్నాయి. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రూ.20 నుంచి 30 వేల వరకు జీతం వస్తుంది. వీరిలో కొంత మంది విధులకు హాజరు కాకుండా పై అధికారులకు రూ.5వేలు ఇస్తారనే ఆరోపణలు ఉన్నాయి. వీరంతా బయట వేరే ఉద్యోగాలు, వ్యాపారాలు, కాంట్రాక్టు పనులు చేస్తుంటారు. వీరు బయో మెట్రిక్ హాజరు వేసి వెళ్లిపోతుంటారనే ఆరోపణ లున్నాయి. కొంతమంది ఇళ్ల వద్దనే బయోమెట్రిక్ వేసే ఏర్పా ట్లు చేసుకున్నట్టు తెలుస్తోంది. ఆర్‌ఆర్.పేట మున్సిపల్ పార్కులో గార్డెనర్‌గా ఓ మహిళా పర్మినెంట్ ఉద్యోగి ఉన్నారు. ఈమెకు నెలకు సుమారు రూ.60 వేలు జీతం వస్తుంది. ఈమె విధులకు హాజరు కాకుండా బినామి వర్కర్లను పెట్టి నెలకు రూ.10 వేలు ఇస్తుంటారనే ఆరోపలున్నాయి. ఆ వ్యక్తి కూడా ఉదయం ఒక అరగంట, సాయంత్రం ఒక అరగంట తూతూమంత్రంగా శుభ్రం చేసి వెళ్లిపోతుంటాడు. అశోక్ నగర్ పార్కులో అవుట్ సోర్సింగ్ ఉద్యోగి గార్డెనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈమెకు రూ.21 వేలు జీతం. ఆమె విధులకు హాజరు కాకుండా బినామి వర్కర్‌ను పెట్టుకుంది. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు 958 మంది ఉన్నారు. వీరిలో సుమారు 200 మంది పైగా విధులకు రాకుండానే జీతాలు తీసుకుంటారు. వీరంతా వేర్వేరు ఉద్యోగాలు బయట చేసుకుంటూ ఉంటారు. నగర పాలక సంస్థలో జరుగుతున్న ఈ వ్యవహారంపై ఉన్నత స్థాయి అధికారులచే దర్యాప్తు జరి పించి నిజానిజాలు తేల్చాలని నగరవాసులు కోరుతున్నారు.



మహాత్మా.. మన్నించు !


రైతుబజారు, ఏరియా ఆసుపత్రి వద్ద విగ్రహాలు

విగ్రహాలను నిర్లక్ష్యం చేశారు

చింతలపూడి, ఆగస్టు 14: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ర్యాలీ, జెండాలు ఏర్పాటు, ఇళ్లపై జెండాలు ఎగురవేయాలని పలు కార్యక్రమాలు చేపట్టారు. జాతిపిత మహాత్మగాంధీ విగ్రహానికి కనీసం రంగులు వేయడం మరిచారు. చింతలపూడిలో పలుచోట్ల మహాత్మ గాంధీ విగ్రహాలు ఆదరణ లేకుండా ఉన్నాయి. పాత బస్టాండులోని మహాత్మగాంధీ రైతు బజారు వద్ద ఉన్న విగ్రహం రంగులు లేక వెలవెలబోతోంది. విగ్రహం చేతిలో కర్ర కూడా మాయమైంది. ఏరియా ఆసుపత్రి వద్ద బయట రోడ్డు డ్రెయినేజీపై గాంధీ విగ్రహాన్ని పెట్టి చుట్టూ ఆక్రమణలు చేశారు.

మత్తు పదార్థాలపై సమాచారానికి టోల్ ఫ్రీ 14500


సదస్సులో ఆర్ఐవో చంద్రశేఖరబాబు

ఏలూరు అర్బన్, ఆగస్టు 14: మత్తు పదార్థాల సమాచారం తెలియజేయడానికి అనువుగా టోల్‌ఫ్రీ నెంబర్ 14500 ఏర్పాటు చేశామని, ఈ నెంబర్ ఉన్న ఫ్లెక్సీల కళాశాలల వద్ద ఉంచాలని ఎస్ఈబీ ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు తెలిపారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, చట్టాలపై నగరంలోని కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులకు బుధవారం సెయింట్ థెరిస్సా బాలికల జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. సరదాగా ప్రారంభమయ్యే మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవనవిధానాన్ని, నాడీవ్యవస్థను కృంగదీస్తాయన్నారు. ఇంటర్మీడియట్ విద్యామండలి ఆర్ఐవో చంద్రశేఖరబాబు మాట్లాడుతూ సిగరెట్, మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటుపడిన వారికి గుర్తిస్తే వారిని పునరావాస కేంద్రాలు, కౌన్సెలింగ్, డీఎడిక్షన్ సెంటర్లకు తరలించి నియంత్రణ చర్యలు చేపట్టవచ్చన్నారు. కార్యక్రమంలో సెబ్ ఇన్‌స్పెక్టర్ అరుణమ్మ, ఎస్సై శివప్రసాద్, సర్వజన ప్రభుత్వాసుపత్రి సైకలాజిస్టు డాక్టర్ వంశీ, తదితరులు పాల్గొన్నారు.

చెట్లను సంరక్షించాలి : ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్


కేడెట్లకు మొక్కలను పంపిణీ చేస్తున్న సీవో

ఏలూరు అర్బన్, ఆగస్టు 14: చెట్లను నాశనం చేయడం ప్రకృతి వైపరీత్యాలకు ఒక కారణమని ఎన్‌సీసీ 19 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అమిత్ పాండే అన్నారు. సెయింట్ థెరిస్సా మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ మాట్లాడుతూ మొక్కలు, చెట్ల వల్ల ప్రయోజనాలు వివరించారు. కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ సెలిన్‌రోజ్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో భాగంగా కేడెట్లకు మొక్కలు నాటి, వాటిని సంరక్షించే బాధ్యత అప్పగించామన్నారు. కళాశాల దత్తత తీసుకున్న గ్రామాల్లో కూడా మొక్కలు నాటుతామన్నారు. ఎన్‌సీసీ కార్యాలయ పరిపాలనాధికారి లెఫ్టినెంట్ కల్నల్ రితేష్, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ మరియా క్రిస్టియా, సిస్టర్ సుశీల, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో విస్తృతంగా స్కూలు బస్సుల తనిఖీ


స్కూల్ బస్సులను తనిఖీ చేస్తున్న అధికారులు

ఏలూరు క్రైం, ఆగస్టు 14: జిల్లాలో రవాణాశాఖ అధికారులు స్కూలు బస్సుల తనిఖీలు చేపట్టారు. రవాణా శాఖ ఉప కమిషనర్ శాంతకుమారి మాట్లాడుతూ జిల్లాలో ప్రైవేటు స్కూలు యాజమాన్యం బస్సులలో విద్యార్థులను పరిమితికి మించి ఎక్కించరాదని సూచించారు. నిబంధనల ప్రకారం అన్ని సదుపాయాలు ఉండాలన్నారు. ఫస్ట్ ఎయిడ్ కిట్, ఫైర్‌సేఫ్టీ, ఎగ్జిట్‌డోర్స్, బస్ ఫిట్‌నెస్, ట్యాక్స్‌లు, అర్హత కల్గిన డ్రైవర్లను నియమించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 23 ప్రాంతాల్లో బుధవారం నిర్వహించిన తనిఖీల్లో 63 కేసులు నమోదు చేశారు. మరో వారం రోజుల పాటు తనిఖీలు కొనసాగిస్తామని తరువాత ఆకస్మిక తనిఖీ నిర్వహిస్తామని డీటీసీ ఎస్ శాంతకుమారి తెలిపారు.

నేరస్తులకు శిక్ష పడేలా వాదనలు ఉండాలి : ఎస్పీ సరిత


సీఐడీ ఎస్పీకి పూలమొక్క ఇస్తున్న రాజేంద్ర

ఏలూరు క్రైం, ఆగస్టు 14: నేరస్తులకు శిక్ష పడేవిధంగా ప్రాసిక్యూషన్ నిర్వహించాలని సీఐడీ విభాగం ఎస్పీ కేవీజీ. సరిత సూచించారు. ఏలూరు వచ్చిన ఆమెను ఏలూరు సీఐడీ కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మాండ్రు రాజేంద్ర కలిసి పూలమొక్కను అందించారు. ఎస్పీ సరిత మాట్లాడుతూ ఏ ఒక్క ఆధారాన్ని విడిచి పెట్టకుండా ప్రాసిక్యూషన్‌లో నిరూపించి నేరస్తులకు శిక్ష పడేవిధంగా వాదనలు ఉండాలని సూచించారు. మహిళా న్యాయవాదులు ఎస్పీ సరితను కలిసి అభినందనలు తెలిపారు. న్యాయవాదులు వృత్తిలో రాణించి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు.

తలసేమియా బాధిత చిన్నారులకు రక్తమార్పిడి


తలసేమియా బాధిత చిన్నారి

ఏలూరు క్రైం, ఆగస్టు 14: రెడ్‌క్రాస్ భవనంలో 14 మంది తలసేమియా, సికిల్‌సెల్ బాధిత చిన్నారులకు బుధవారం రక్తమార్పిడి నిర్వహించినట్లు ఛైర్మన్ బీవీ.కృష్ణారెడ్డి తెలిపారు. రక్తదాతల సహకారంతో బాధితులకు రక్తమార్పిడి నిర్వహిస్తున్నామన్నారు. మందులతో పాటు దాతల సహకారంతో ఉచిత భోజన వసతి ఏర్పాటు చేస్తున్నామన్నారు. మల్లినేని బెనర్జీ, కెబి సీతారామ్, డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కె వర ప్రసాదరావు, బి.పద్మజా వాణి, డాక్టర్ జి.స్పందన, ఎన్‌జీవీబీ స్వామి, డి.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

దేశ విభజన గాయాల నుంచి తేరుకోవాలి


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు కిశోర్

లింగపాలెం, ఆగస్టు 14: విభజన గాయాల నుంచి తేరుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిశోర్ అన్నారు. ధర్మాజిగూడెంలో దేశ విభజనపై విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భారత దేశం సార్వభౌమాధికార దేశమని, అనేక మతాలు ఏకతాటిపై ఉన్న దేశమని అన్నారు. అసెంబ్లీ కన్వీనర్ ఒంటెద్దు ఏసువరప్రసాద్, ఆర్ఎస్ఎస్ చక్రధర్‌రావు, గారపాటి బుజ్జియ్య క్రాంతి, సురేష్, రవి, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగులను స్వచ్ఛంద సంస్థలు ఆదుకోవాలి


వీల్‌చైర్ అందజేస్తున్న కరాటం రాంబాబు

కొయ్యలగూడెం, ఆగస్టు 14: దివ్యాంగులను ఆదుకోవాలని డీసీసీబీ మాజీ ఛైర్మన్ కరాటం రాంబాబు కోరారు. కొయ్యలగూడెంలో పసుపులేటి అచ్యుతరాణికి రాము సోషల్ సర్వీస్ సొసైటీ సమకూర్చిన వీల్‌చైర్‌ను బుధవారం ఆయన అందజేశారు. గతంలో పోలియో ఉన్న ఎంతో మంది చిన్నారులు ఇబ్బందులకు గురయ్యారని, పోలియోరహిత సమాజం కోసం ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు ఎంతో కృషి చేస్తున్నాయని అన్నారు. వైకల్యం ఉన్న పిల్లలను ఆదుకోవడానికి మరిన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సోషల్ సర్వీస్ సొసైటీ సభ్యులు, జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జాతీయ జెండాతో భారీ ర్యాలీ


ఏలూరులో జాతీయ పతాకంతో ర్యాలీ


బుట్టాయగూడెం పాఠశాలలో జాతీయ జెండాలతో విద్యార్థుల ప్రదర్శన


ధర్మాజీగూడెంలో జాతీయ పతాకాలతో విద్యార్థుల ర్యాలీ

ఏలూరు రూరల్, ఆగస్టు 14: నగరంలోని అల్లూరి సీతారామరాజు స్టేడియం, మార్నింగ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా 125 అడుగుల జాతీయ జెండాతో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని అధ్యక్షుడు ఎస్ఎం అక్బర్ ప్రారంభించారు. స్వాతంత్ర్యంకోసం ప్రాణాలర్పించిన సమరయోధుల ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో సెక్రటరి విజ్ఞేష్, మాధవరావు, జెల్లా వీరభద్రరావు, జంపా సూర్యనారాయణ, ఎస్‌టీవో శ్రీనివాసరావు, ఎస్‌కె లాల్‌సాహెబ్, వాకర్స్ సభ్యులు సత్యవతి, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో బుట్టాయగూడెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, అంగనవాడీ కేంద్రంలోని ప్రిస్కూలు పిల్లలు జాతీయ జెండాలతో బుధవారం ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం తెల్లం సీతామహాలక్ష్మి, సూపర్‌వైజర్ కె.ఝాన్సీ, జీఎంఎస్‌కె ఎండి షమీలా సుల్తానా అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● లింగపాలెం: ధర్మాజీగూడెంలో బీజేపీ మండల అధ్యక్షుడు కుర్రా సుబ్రహ్మణ్యేశ్వర వరప్రసాద్ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. పాఠశాల విద్యార్థులతో ప్రధాన రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశనుండే దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. చలసాని రత్నాకర్, కుర్రా సుబ్రహ్మణ్యేశ్వరవరప్రసాద్, ఒంటెద్దు ఏసుప్రసాద్, బీజేపీ నేతలు, విద్యార్థులు పాల్గొన్నారు.

● చింతలపూడి: పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఎన్డీఏ కూటమి నాయకులు ఫైర్‌స్టేషన్ సెంటర్ వరకు మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఇంటింటా జాతీయ జెండా ఎగరాలన్న నినాదం సందర్భంగా జాతీయ జెండాలను పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌కిశోర్, నియోజకవర్గ కన్వీనర్ ఏసువరప్రసాద్, తోట వెంకటనారాయణ, సీహెచ్ ధర్మరాజు, కొత్తపూడి శేషగిరిరావు, పక్కాల వెంకటేశ్వరరావు, పి.నాగ విజయ్‌కుమార్, అప్పారావు, మధుబాబు, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

● నిడమర్రు: పెదనిండ్రకొలను గాంధీ భవనంలో సర్వోదయమండలి ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం ఫ్రీడం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్వోదయ మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు, సాగిరాజు జనకిరామరాజు, సత్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.


గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్


ఇంద్ర బస్సులను ప్రారంభించిన ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి

సంక్షేమం, అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే చింతమనేని

పెదపాడు, ఆగస్టు 14: ప్రజా సంక్షేమానికి, రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. వట్లూరులో బుధవారం జరిగిన మీ కోసం - మీ చింతమనేని కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నెహ్రూనగర్ కాలనీ, వట్లూరు ఐటీఐ, పంచాయతీ కార్యాలయాల వద్ద నిర్వహించిన గ్రామసభల్లో స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి ఆయా శాఖల అధికారులకు ఆదేశాలిచ్చారు. చింతమనేని మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందిస్తామన్నారు. ఉప్పలపాటి రాంప్రసాద్, కొమ్మన లక్ష్మణమోహన్, ముళ్లపూడి.సాంబశివరావు, గుత్తా అనిల్, లావేటి శ్రీనివాసరావు, కొత్తూరు చినబాబు, మోరు దశరథ్, జనసేన నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్సు పాస్‌ల పంపిణీ

దెందులూరు: విద్యార్థులు బాగా చదువుకుని వృద్ధిలోకి రావాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌రావు అన్నారు. కొవ్వలి షాలేము వృద్ధాశ్రమ వ్యవస్థాపకులు, దాత బుసి ఏసోబు నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు బస్సు పాస్ నిమిత్తం రూ.3 లక్షలు కేటాయించారు. ఉషా పిక్చర్స్ అధినేత వడ్లపట్ల బాలకృష్ణారావు, దాతతో కలిసి విద్యార్థులకు చింతమనేని పాస్‌లు అందజేశారు. వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, దుస్తువులను అందజేశారు. వెలమాటి రాంబాబు, గుత్తా రాజా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంద్ర బస్సులు ప్రారంభించిన ఎమ్మెల్యే చంటి

ఏలూరు క్రైం: ఆర్టీసీ ఏలూరు డిపో నుంచి రెండు ఇంద్ర బస్సులను ఎమ్మెల్యే బడేటి చంటి బుధవారం ప్రారంభించారు. సర్వీస్ నెంబర్ 4792, 4795 బస్సుల స్థానంలో ఇక నుంచి కొత్త బస్సులు నడుపుతామని ఏలూరు డిపో మేనేజర్ బి.వాణి తెలిపారు. చార్జీలు సమయం యథాతథంగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలూరు డిపో ఏఎంటి బి మురళి, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ ఐ ప్రేమ్‌కుమార్ అనేక మంది కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

చెస్ క్రీడాకారిణి ప్రేమ రక్షితకు ఎంపీ చేయూత

ఏలూరు రూరల్, ఆగస్టు 14: చదరంగంలో ప్రతిభ కనబరుస్తున్న ప్రేమ రక్షితకు ప్రభుత్వపరంగా ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్ చేయూతనిచ్చారని యాదవ సంఘం నాయకులు బుధవారం తెలిపారు. తంగెళ్ళమూడికి చెందిన ప్రేమ రక్షిత పదేళ్ల వయస్సులో జాతీయ, అంతర్జాతీయ అండర్ -10 విభాగాల్లో చదరంగం పోటీల్లో పతకాలు గెలుచుకుంది. ప్రస్తుతం అండర్ -19 జాతీయ చెస్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొనేందుకు సాధన చేస్తోంది. ఆర్థిక పరిస్థితులు అంతంతమాత్రంగా ఉండడంతో యాదవ సంఘం నాయకులు ఎంపీని కలిశారు. ఆయన చొరవ తీసుకుని కేంద్ర క్రీడల యువజన వ్యవహారాల శాఖకు లేఖ రాశారు. ప్రేమరక్షితను శ్రీనివాసరావు, ఉక్కుసూరి గోపాలకృష్ణ, కిలారు బుజ్జి, గొర్ల రామారావు అభినందించారు.

● ఏలూరు టూటౌన్: కైకలూరు నియోజకవర్గం ఉదయపల్లికి చెందిన వివాహిత లక్ష్మి ఆచూకీ కొనుగొనాలని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ జిల్లా ఎస్పీని బుధవారం కోరారు. లక్ష్మిభవాని అదృశ్యమై వారం రోజులు కావస్తుందన్నారు. కుటుంబ సభ్యులు తల్లడిల్లిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు వెంటనే స్పెషల్ టీమ్ ఏర్పాటు చేసి ఆచూకీ కనుగొనాలన్నారు.

కుంగ్‌ఫూలో బంగారు పతకం సాధించిన తేజస్

ఏలూరు టూటౌన్, ఆగస్టు 14: విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి కుంగ్‌ఫూ టోర్నమెంట్‌లో బంగారు పతకం మెడల్ సాధించిన ఏలూరుకు చెందిన కామిశెట్టి తేజస్‌ను ఎమ్మెల్యే బడేటి చంటి అభినందించారు. బడేటి క్యాంపు కార్యాలయంలో బుధవారం చంటి మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరిన్ని పతకాలు సాధించాలని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. చిన్నారి తేజస్‌ను ఆశీర్వదించారు.

అద్దెకు పోలీస్ కాంప్లెక్స్, క్యాంటీన్

ఏలూరు క్రైం, ఆగస్టు 14 : జిల్లా పోలీస్ శాఖకు సంబంధించిన షాపులు, క్యాంటీన్‌ను అద్దెకు ఇవ్వడానికి అధికారులు నిర్ణయించారు. ఎస్పీ కె ప్రతాప్ శివకిశోర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫైర్‌స్టేషన్ సమీపంలో పోలీస్ షాపులు నెంబర్ 2,3,4,5,6 అద్దెకు ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద పోలీస్ క్యాంటీన్‌ను కూడా అద్దెకు ఇవ్వనున్నట్లు తెలిపారు. దుకాణాలను, క్యాంటిన్‌ను అద్దెకు తీసుకునే వారు తమ దరఖాస్తులను జిల్లా పోలీస్ వెల్ఫేర్ నోడల్ అధికారికి అందజేయాలన్నారు. వివరాలకు ఏఆర్‌డీఎస్పీ శ్రీహరిని 9440796602లో సంప్రదించాలన్నారు.

ఎంపీడీవోపై చర్యలు తీసుకోవాలి

పోలవరం, ఆగస్టు 14: గిరిజన సర్పంచ్‌లపై దురుసుగా వ్యవహరించిన ఎంపీడీవోపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కమిటీ డిమాండ్ చేసింది. సీపీఎం మండల కార్యదర్శి గుడెల్లి వెంకట్రావు బుధవారం మాట్లాడుతూ గిరిజన సర్పంచ్‌లపై దురుసుగా వ్యవహరిస్తున్న ఎంపీడీవోపై జిల్లా అధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలో సర్పంచులకు శిక్షణ కార్యక్రమంలో ఎల్ఎన్‌డీపేటలో మండల సర్పంచులు కార్యదర్శులు గ్రీన్ అంబాసిడర్ల ముందు శిక్షణలో టీఏ, డీఏ అడిగిన, అభివృద్ధిపై ప్రశ్నించిన సర్పంచ్‌లను ఇష్టానుసారంగా దుర్భాషలాడుతూ అవమానించడం దారుణమన్నారు. మండలంలో అభివృద్ధి కోసం కేటాయించిన నిధులు చెక్కుల రూపంలో మూలుగుతున్నాయని తక్షణమే పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి నిధులను మండల అభివృద్ధికి కేటాయించాలని ఆయన కోరారు.

సొసైటీలను పూర్తిస్థాయిలో కంప్యూటరీకరించాలి

ఏలూరు సిటీ, ఆగస్టు 14: జిల్లాలోని అన్ని సహకార సంఘాలలో పూర్తిస్థాయిలో కంప్యూటరీకరణ చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన బుధవారం జరిగింది. సహకార సంఘాల వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదన్నారు. మల్టీ పర్పస్ కో ఆపరేటివ్ సొసైటీలు, ప్రైమరీ ఫిషరీ సొసైటీలు, డెయిరీ కో ఆపరేటివ్ సొసైటీల ఏర్పాటుకు ప్రభుత్వం ఆలోచన చేస్తుందన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా పెట్రోలు బంకులు, ధాన్యం నిల్వ గోడౌన్‌లు, కామన్ సర్వీస్ కేంద్రాల ఏర్పాటు ద్వారా మరింత అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో సహకార సంఘాల సక్రమ నిర్వహణకు సభ్యత్వం, డిపాజిట్లు, రుణాలు, పెట్టుబడులు తదితర లావాదేవీలు నిర్దేశిత సమయంలో కంప్యూటరీకరణ చేయాలన్నారు. ధాన్యం నిల్వ గొడౌన్‌ల నిర్మాణంలో ధాన్యం ఆరబెట్టేందుకు ర్యాంపులు నిర్మించాలన్నారు. సమావేశంలో జేసీ పి.ధాత్రిరెడ్డి, డీసీవో శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకంపై సమన్వయంతో పనిచేయాలి

చింతలపూడి ఎత్తిపోతల పథకంపై సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కె వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్, జాతీయ రహదారులు, రెవెన్యూ అధికారులతో చింతలపూడి ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులపై బుధవారం కలెక్టర్ సమీక్షించారు. సమగ్ర వివరాలతో ఎన్‌హెచ్ ఉన్నతాధికారులకు లేఖ ద్వారా తెలియజేయాలన్నారుజ సమావేశంలో జేసీ పి ధాత్రిరెడ్డి , ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సెప్టెంబరు 14న మెగా లోక్‌అదాలత్

చింతలపూడి, ఆగస్టు 14: సెప్టెంబరు 14న జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి మధుబాబు అన్నారు. పోలీస్, ఎక్సైజ్, న్యాయవాదులతో బుధవారం సదస్సు నిర్వహించారు. పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి జాతీయ లోక్‌అదాలత్‌ను వినియోగించుకోవాలని, సివిల్ కేసులు, ప్రామిసరీ నోట్‌కేసులు, మనోవర్తి, బీఎస్ఎన్ఎల్ రాజీపడదగ్గ క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రతిరోజూ కోర్టు ఆవరణలో ప్రి అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల సమయం, సొమ్ము ఆదా అవుతుందని, పెండింగ్ కేసుల బారం తగ్గుతుందని ఆయన తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, నాగరాజు, న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు

ఏలూరు రూరల్, ఆగస్టు 14: ఏలూరు అర్బన్ తహసీల్దార్‌గా గంధం శేష గిరిరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయనను వీఆర్వోలు, ఆర్ఐలు కలిసి అభినందనలు తెలిపారు. శేషగిరిరావు పెదవేగి తదితర ప్రాంతాల్లో తహసీల్దార్‌గా పనిచేసి ఏలూరు తహసీల్దార్‌గా నియమితులయ్యారు.

● లింగపాలెం: తహసీల్దార్ మహ్మద్ నజీముల్లాసా నియమితులయ్యారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం నుంచి ఆయన బదిలీపై లింగపాలెం తహసీల్దార్‌గా నియమితులు అయ్యారు.

● నిడమర్రు: తహసీల్దార్‌గా నల్లమిల్లి నాగరాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు డిటి శేఖర్, ఆర్ఐ సుబ్బారావు, రెవెన్యూ సిబ్బంది తదితరులు స్వాగతం పలికారు.




బుట్టాయగూడెం జూనియర్ కళాశాల, చింతలపూడి మండలం వెంకటాపురం, లింగపాలెం మండలం ధర్మాజీగూడెం పాఠశాలల్లో అవగాహన సదస్సులు

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

బుట్టాయగూడెం, ఆగస్టు 14: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.కుసుమ అన్నారు. బాల్య వివాహాల నిరోధక చట్టంపై విద్యార్థినులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. చట్ట ప్రకారం బాలికలకు 18, బాలురకు 21 ఏళ్ల వయసు నిండిన తర్వాతనే వివాహాలు చేయాలని, చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు ఉంటాయన్నారు. విద్యార్థులు ప్రేమ పేరుతో భవిష్యత్‌ను పాడుచేసుకోవద్దని జీఎస్ఎంకె ఎండి షమీలా సుల్తానా అన్నారు. చదువులపై దృష్టిపెట్టి ప్రయోజకులు కావాలన్నారు. తల్లిదండ్రులకు, చదువుకున్న కళాశాలకు మంచి పేరు తేవాలని సూచించారు. సూపర్‌వైజర్ కె.ఝాన్సీ, హెచ్‌సీ కృష్ణంరాజు, అధ్యాపకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు విద్యార్థినులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం

చింతలపూడి: వ్యక్తిగత పరిశుభ్రతకు అందరూ ప్రాధాన్యం ఇవ్వాలని ఐసీడీఎస్ పీవో పి.మాధవి అన్నారు. మిషన్ శక్తి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా వెంకటాపురం హైస్కూల్ వద్ద కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికలు పాటించాల్సిన జాగ్రత్తలు, బాల్య వివాహాల వల్ల అనర్థాలను వివరించారు. ఉపేంద్ర, ప్రసాద్, ఫణీంద్ర, మధుబాబు, రాంబాబు, నాగేశ్వరరావు, రామలక్ష్మి, సత్యనారాయణ పాల్గొన్నారు.

● లింగపాలెం: విద్యార్థినులు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని, అపరిచితులు అనుచితంగా ప్రవర్తిస్తే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని సీడీపీవో మాధవి అన్నారు. ధర్మాజిగూడెం పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థి దశ నుండే ఆర్థికాభివృద్ధిపై అవగాహన కలిగి ఉండాలని, ఆత్మరక్షణ కళలను నేర్చుకోవాలని అన్నారు. బాలికలకుచట్టపరమైన భద్రత పోక్సో చట్టం గురించి వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.కుమారి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కౌలు రైతులు

మోసపోయిన రైతులకు ధాన్యం సొమ్ము ఇప్పించాలి

ఏలూరు రూరల్, ఆగస్టు 14: దళారుల చేతిలో మోసపోయిన రైతులకు ధాన్యం సొమ్ము చెల్లించేవిధంగా చర్యలు చేపట్టాలని కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య డిమాండ్ చేశారు. కౌలురైతుల సంఘం, రైతుసంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. జమలయ్య మాట్లాడుతూ 2023 డిసెంబర్ నుంచి జనవరి 2024 వరకు రైతులు పండించిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయటంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. దళారులకు పంట అమ్మి రైతులు మోసపోయారన్నారు. నూజివీడు మండలంలోని సుంకొల్లు, పడమట దిగవల్లి, అన్నవరం, సూరేపల్లి, చాట్రాయి గ్రామాలకు చెందిన 116 మంది రైతులు అన్నవరం గ్రామానికి చెందిన నాగచంద్రశేఖర్, అతని సోదరుడు సురేష్‌కు ధాన్యం విక్రయించి మోసపోయారన్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా కేసున మోదు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర కార్యదర్శి డేగా ప్రభాకర్ మాట్లాడుతూ రైతులను మోసం చేసిన దళారులను మంత్రి, పోలీసులు రక్షించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. గిరీష్‌బాబు, కస్తూరి శ్రీనివాసరావు, పి.వీరవెంకయ్య, కంచర్ల నాగరాజు, వెంకటేశ్వరరావు, బండి వెంకటేశ్వరరావు, ఏడుకొండలు పాల్గొన్నారు.

గ్రామాల సుస్థిర అభివృద్ధి లక్ష్యం కావాలి


మాట్లాడుతున్న జడ్పీ సీఈవో సుబ్బారావు

ఏలూరు రూరల్, ఆగస్టు 14: గ్రామాల సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా సర్పంచ్‌లు ముందుకు సాగాలని జడ్పీ సీఈవో కె.వి సుబ్బారావు అన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు మూడురోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో బుధవారం ఆయన మాట్లాడారు. గ్రామస్థాయిలో పారిశుధ్యం, తాగునీటి సరఫరాపై అధికారులకు సూచనలు ఇచ్చారు. గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు, ప్రభుత్వ పథకాలు, గ్రామస్థాయి పరిపాలన, మౌలిక సౌకర్యాలపై అవగాహన కల్పించారు. డీపీవో తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ మాట్లాడుతూ చెత్తసేకరణ ద్వారా తడిచెత్తను, పొడిచెత్తను వేరుచేసి ఆ వ్యర్థాల నుండి ఎరువులను తయారుచేసి సంపద సృష్టించుకోవాలని సూచించారు. ఎంపీడీవో బండి ప్రణవి, డీఎల్‌డీవో లక్ష్మి, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

● కామవరపుకోట: మండల పరిషత్ కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు శిక్షణ కార్యక్రమాలు ముగిశాయి. ముగింపు సందర్భంగా శిక్షణ పొందిన సర్పంచ్‌లకు, కార్యదర్శులకు ప్రశంసా పత్రాలు, మెమెంటోలు అందచేశారు. జీడీవీ.శ్రీనివాసరావు, నేతల విజయ్, ఎంపీడీవో జంగం స్వర్ణభారతి, ఏవో సత్యవాణి, ఈవోపీఆర్డీ మరిడయ్య పాల్గొన్నారు.

సహకార సంఘాలు కంప్యూటరీకరించాలి

భీమడోలు, ఆగస్టు 14: మండలంలోని సహకార వ్యవసాయ సంఘాల రికార్డుల డేటాను త్వరితగతిన కంప్యూటీకరణ చేయాలని సొసైటీ అధికారులను ఎంపీడీవో ఆదేశించారు. బుధవారం గుండుగొలను ప్రాథమిక వ్యవసాయశాఖ కార్యాలయాన్ని ఎంపీడీవో పద్మావతి సందర్శించారు. కంప్యూటీకరణ పనులను పరిశీలించి వెల్ఫేర్ అసిస్టెంట్లకు, డిజిటల్ అసిస్టెంట్లకు పలు సూచనలు జారీ చేశారు. సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

60 ఏళ్లు పైబడిన వారికి పింఛన్లు మంజూరు చేయాలి

కామవరపుకోట, ఆగస్టు 14: కుటుంబంలో 60 ఏళ్లు పైబడిన వారందరికీ పింఛన్లు మంజూరు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి టీవీఎస్.రాజు, ఏఐటీయూసీ నాయకులు కంకిపాటి బుచ్చిబాబులు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద బుధవారం వారు మాట్లాడుతూ కుటుంబంలో ఒక్కరికే పెన్షన్ విధానం అమలు జరుగుతుందని, ఆ విధానం వలన అర్హత ఉండి పెన్షన్లు అందని వారు ఉన్నారని చెప్పారు.

సంక్షిప్త సమాచారం..

- **జీలుగుమిల్లి :** జాతీయ రహదారి మరమ్మతులకు జీలుగుమిల్లి నాల్గు రోడ్ల కూడలిలో జెసీబీతో తవ్వారు. నెలల తరబడి పనులు నిలిచిపోయాయి. తాటియాకులగూడెం జీలుగుమిల్లి గ్రామాల మధ్య నిత్యం వాహనాల రాకపోకలకు దుమ్ము లేస్తుంది. జనసేన నాయకుడు పసుపులేటి రాము ఆధ్వర్యంలో వాటర్ ట్యాంకుతో తడుపుతున్నారు.
- **కామవరపుకోట :** హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ అన్నారు. ప్రతీ ఇంటిపై, ప్రతీ కార్యాలయంపై పతాకాన్ని ఎగరవేయాలన్నారు.
- వరసిద్ధి వినాయకస్వామి ఆలయం వద్ద భక్తులు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. గరికతో అర్చనజరిపి బెల్లం నివేదనలు సమర్పించారు. సుదర్శనం సత్య శ్రీనివాసాచార్యులు భక్తులతో పూజలు చేయించారు.
- కామవరపుకోట ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతుందని ప్రిన్సిపాల్ కె.విజయబాబు తెలిపారు. బిఏ(పొలిటికల్ సైన్స్), ఎకనామిక్స్, బికాం కంప్యూటర్ అప్లికేషన్స్, బిఎస్సీ(జువాలజి) కోర్సుల్లో ప్రవేశానికి రెండో విడత అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించినట్టు ఆయన తెలిపారు.
- **భీమడోలు :** ఎస్ఈబి స్టేషన్ పరిధిలో వివిధ నేరాల్లో పట్టుబడిన వాహనాలకు ఈనెల 17న వేలం వేయనున్నట్లు సీఐ గిరిజా సత్యకుమారి తెలిపారు. 22 ద్విచక్ర వాహనాలు, ఒక కారు వేలానికి అందుబాటులో ఉన్నాయని తెలిపారు.
- గుండుగొలను సీతారామస్వామి ఆలయంలో 17 వరకూ వార్షిక పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. భక్తులు హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటీ కోరింది.
- **ఉంగుటూరు :** నారాయణపురం జూనియర్ కళాశాలలో దాతల సహకారంతో విద్యార్థులకు బ్యాగులు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రిన్స్‌పాల్ బి.వి. శ్రీనివాస్, దాత వేగేశ్న రంగరాజు, గురువెల్లి రాజారావు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.
- ఉంగుటూరు మండలం తల్లాపురం పాఠశాలలో దాత బసవ నాగేశ్వరరావు, ఆయన తల్లిదండ్రులు సత్యనారాయణ, మంగాయమ్మల జ్ఞాపకార్థం 70 స్టీల్ ప్లేట్స్ పంపిణీ చేశారు. హెచ్ఎం పుప్పాల నరసింహరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- **పోలవరం :** నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొనాలని టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు కోరారు. ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.



ఎమ్మెల్యే ప్రభాకర్‌కు విరాళం అందిస్తున్న కొవ్వలి మహిళలు

రాజధాని నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం

పెదవేగి, ఆగస్టు 14 :ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణం రాష్ట్ర ప్రజలు గర్వించేలా ఉంటుందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దెందులూరు మండలం కొవ్వలి గ్రామ మహిళలు గ్రామంలో ఇంటింటికి తిరిగి సేకరించిన నగదు రూ.5,00,516లను పెదవేగి మండలం దుగ్గిరాలలో ఎమ్మెల్యేకు అందించారు. ఐదేళ్ళ రాక్షస పాలనలో రాష్ట్రానికి రాజధాని లేకుండా పోయిందన్నారు.ప్రజల సహకారం, భాగస్వామ్యంతో, అంతర్జాతీయ ప్రమాణాలతో రాజధాని నిర్మాణం పూర్తి చేసుకుంటుందని తెలిపారు.కొవ్వలి మహిళల సంకల్పాన్ని అభినందించారు. పార్టీ నాయకులు మాగంటి నారాయణ ప్రసాద్, బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, శ్రీనివాసరావు, నంబూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



భీమవరంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అంటువ్యాధుల అంతానికి 'మీకు తెలుసా' ప్రచారం

అక్టోబరు 12 వరకు అవగాహన

భీమవరం క్రైం, ఆగస్టు 14 :నాకో మార్గదర్శకాలతో ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాలతో రెండు నెలలు పాటు "ఇంటెన్సిఫైడ్ ఐఈసీ ప్రచారం" ఈనెల 12వ తేదీన నుంచి ప్రారంభించినట్టు జిల్లా డీఎల్‌టీవో డాక్టర్ భానునాయక్, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి కళ్యాణి అన్నారు. భీమవరం ప్రభుత్వాసుపత్రిలో బుధవారం పశ్చిమగోదావరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం వారు "మీకోసం" కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ, పోస్టర్ల ఆవిష్కరణ జరిగింది. ఏఆర్టీ సెంటర్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.గోవిందబాబు, డాక్టర్ రాంబాబులు మాట్లాడుతూ 2030 నాటికి ఎయిడ్స్, ఇతర అంటువ్యాధుల మహమ్మారిని అంతం చేయాలనే లక్ష్యంతో కృషి చేస్తున్నామన్నారు. ఏపీ శాక్స్ పశ్చిమగోదావరి జిల్లా మధుసూదన రావు మాట్లాడుతూ ఈ రెండు నెలల్లో సోషల్ మీడియా, జానపద ప్రదర్శనలు, కళాశాలలు, జిల్లాలో 250 గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో అవగాహన నిర్వహిస్తామన్నారు. నోడల్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్, డీఐసీ హరనాథ్, ఏఆర్టీ కౌన్సిలర్లు ప్రభాకర రావు, పూర్ణేంద్ర, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ నిట్‌కు విదేశీ విద్యార్థులు

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 14 : తాడేపల్లిగూడెం ఏపీ నిట్‌కు విదేశీ విద్యార్థులు పోటెత్తుతున్నారు. ఈ ఏడాది బీటెక్‌లో ప్రవేశానికి 250 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక, తదితర దేశాల నుంచి ఏపీ నిట్‌లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. విదేశీ విద్యార్థుల కోసం ఏపీ నిట్‌లో 20 సీట్లు కేటాయించారు. గతంలో కేంద్ర ప్రభుత్వమే విదేశీ విద్యార్థుల కోసం సీట్లు కేటాయించేది. అడ్మిషన్లు నిర్వహించేది. ఇప్పుడు ఆ బాధ్యతను ఏపీ నిట్‌కు అప్పగించారు. విదేశీ విద్యార్థుల కోసం అంతర్జాతీయ స్థాయిలో హాస్టల్ వసతి సదుపాయాలు ఏర్పాటు చేశారు. విద్యార్థుల అర్హతను బట్టి అడ్మిషన్లు కల్పించనున్నారు.

స్టాక్ పాయింట్లలో ఇసుక

భీమవరం టౌన్, ఆగస్టు 14 :తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ఉసులుమర్రులో- 7,157 మెట్రిక్ టన్నులు, పెండ్యాలలో-1,11,468 టన్నులు, నిడదవోలు మండలం పందలపర్రు-39,278 టన్నులు, ఆయా స్టాక్ పాయింట్లు వద్ద టన్నుకు రూ.270 చెల్లించి ఉచిత ఇసుక పొందవచ్చని కలెక్టర్ నాగరాణి తెలిపారు. రావులపాలెం మండలం రావులపాడు-865 మెట్రిక్ టన్నులు, రావులపాడు-2లో 861 మెట్రిక్ టన్నులు ఆయా స్టాక్ పాయింట్లు వద్ద టన్నుకు రూ.265 చెల్లించి ఇసుక పొందవచ్చని కలెక్టర్ తెలిపారు.

ముగిసిన ఫొటో ఎగ్జిబిషన్



భీమవరం టౌన్, ఆగస్టు 14 : యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భీమవరం రీజనల్ శాఖ ఆధ్వర్యంలో రెండురోజుల పాటు నిర్వహిస్తున్న 'భయానక విభజన స్మరణ' ఫోటో ఎగ్జిబిషన్ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం సర్ సీవీ రామన్ స్కూల్, పీఎస్ఎం, సంస్కార్ స్కూల్ విద్యార్థులు ఎగ్జిబిషన్ తిలకించారని బ్యాంక్ లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ అన్నవరపు నాగేంద్ర ప్రసాద్, మెయిన్ చీఫ్ మేనేజర్ నిర్మల జ్యోతి తెలిపారు. ఇటువంటి విషయాలను భావితరాలకు తెలియ జేయాలని ప్రధాని మోదీ పిలుపు మేరకు ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామన్నారు. చెరుకువాడ రంగసాయి, నరహరిశెట్టి కృష్ణ, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయలో ముగిసిన క్రికెట్ జట్ల ఎంపిక



పెదవేగి, ఆగస్టు 14 : ఏలూరు జిల్లా పెదవేగిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో నవోదయ విద్యాలయ సమితి ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న రీజనల్ స్థాయి క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు బుధవారం ముగిశాయి. 14, 17, 19 ఏళ్ల బాలుర విభాగం జట్లు,17 ఏళ్ళ బాలికల జట్టును ఎంపిక చేశామని నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ బి.సీతాలక్ష్మి తెలిపారు. పీఈటీ కె.కృష్ణ పర్యవేక్షణలో, ఏలూరు ఎన్‌సీప కోచ్ సత్యమూర్తి, సిబ్బంది ఎంపిక పోటీలు నిర్వహించారు. హైదరాబాద్ రీజనల్ స్థాయిలో ఎంపిక చేసిన జట్లు త్వరలో హిమాచల్ ప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని సీతాలక్ష్మి తెలిపారు. హైదరాబాద్ రీజియన్ పరిధిలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, కర్ణాటక, పాండిచ్చేరి రాష్ట్రాల నుంచి మొత్తం 218 మంది విద్యార్థులు పాల్గొనగా 56 మంది విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి వివరించారు.




వేడుకలు నిర్వహించే ఏలూరు పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు.. అభివృద్ధి పథకాల శకటాలకు ముస్తాబు

జెండా పండక్కు ముస్తాబు

అంతటా జెండా పండుగ సందడి కనిపిస్తోంది.. స్వాతంత్ర్య దినోత్సవం కోసం అంతా ముస్తాబు చేస్తున్నారు. హర ఘర్ తిరంగా అంటూ జాతీయ జెండాలను పట్టుకుని ర్యాలీలు చేపట్టారు. ప్రతీ ఇంటిపై జెండా ఎగుర వేస్తున్నారు. పంచాయతీ కార్యాలయాలు విద్యుద్దీపాల కాంతుల్లో వెలుగులు చిమ్ము తున్నాయి.. చిన్నారులు, స్కూల్ విద్యార్థులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు అంతా జెండా పండక్కు రెడీ అయ్యారు



పెదవేగి : పెదవేగి మండలం భోగాపురంలో 2016 ఆగస్టు 15వ తేదీన తొలిసారి 235 అడుగుల భారీ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ప్రతి ఏడాది ఆగస్టు 15న , జనవరి 26న జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్నామని బీజేపీ ఏలూరు పార్లమెంట్ కన్వీనర్ కట్నేని కృష్ణప్రసాద్ తెలిపారు.



విద్యుద్దీపాలంకరణలో ఆచంట పంచాయతీ కార్యాలయం



పాలకొల్లులో జాతీయ పతాకాలతో విద్యార్థుల ర్యాలీ

రాష్ట్రపతి రోడ్డులో మువ్వన్నెల కాంతులు



తణుకు : రాష్ట్రపతి రోడ్డులో సెంట్రల్ లైటింగ్ పోల్స్‌పై మువ్వన్నెల లైటింగ్ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు లైటింగ్ ఏర్పాటు చేశారు. పట్టణ ప్రజలు రాత్రి వేల మువ్వెన్నల కాంతులను తమ ఫోన్లలో బందిస్తున్నారు.

అగ్గిపుల్ల, బియ్యపు గింజపై జాతీయ స్ఫూర్తి




శివప్రసాద్

బియ్యపుగింజపై జాతీయ జెండా




సురేష్‌బాబు

అగ్గిపుల్లపై జాతీయ నాయకులు

ఏలూరు రూరల్, ఆగస్టు 14: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఏలూరుకు చెందిన మైక్రో ఆర్టిస్టులు దోరా శివప్రసాద్, మేతర సురేష్ బాబులు సూక్ష్మ చిత్రాల ద్వారా తన దేశభక్తిని చాటుకుంటున్నారు. శివప్రసాద్ బియ్యపు గింజపై జాతీయ జెండాను రూపొందించారు. సురేష్‌బాబు అరంగుళం ఎత్తులో అగ్గిపుల్లలపై సమరయోధుల చిత్రాలను చెక్కి అబ్బురపరిచారు. మహాత్మగాంధీ, అల్లూరి సీతారామ రాజు, సుభాష్ చంద్రబోస్ ఫొటోలను చెక్కారు.



భీమవరంలో పంద్రాగస్టు వేడుకలకు ముస్తాబు



మాట్లాడుతున్న అదనపు డైరెక్టర్ డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి

అంటువ్యాధుల నివారణపై అప్రమత్తతేదీ ?

ఏలూరు అర్బన్, ఆగస్టు 14 : "మలేరియా, డెంగీ, చికున్ గున్యా అనుమానిత లక్షణాలు నమోదైన ప్రతీ కేసుకు సంబంధించిన టెస్టింగ్, ట్రీట్‌మెంట్‌లపై డీఎంహెచ్‌వోల వద్ద సమగ్ర సమాచారం ఉండాల్సిందే. వాటిపై కేస్ స్టడీస్ చేయాల్సిందే. ఈ రెండు జిల్లాల్లో అంటు వ్యాధుల వ్యాప్తి, నివారణ చర్యల సమాచారం రాష్ట్ర అధికారులకు గాని, కార్యాలయానికి గాని పంపకపోవడం విచారకరం. కేవలం పత్రికల్లో వచ్చే సమాచారంతోనే ఇక్కడి పరిస్థితులు మాకు తెలుస్తున్నాయి. డెంగీ, మలేరియా జ్వరాల కేసులు నమోదైన ప్రాంతాల్లో 8 వారాలపాటు ఫీవర్, లార్వా సర్వేలను తప్పనిసరిగా నిర్వహించండి" అంటూ వైద్య ఆరోగ్యశాఖ (అంటువ్యాదుల నియంత్రణ విభాగం) రాష్ట్ర అదనపు డైరెక్టర్ డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి వైద్యాధికారులను ఆదేశించారు. కీటకజనిత వ్యాధులు, వాటి నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని మలేరియా అధికారులు, క్షేత్రస్థాయి వైద్యాధికారులకు స్థానిక ఆశ్రం వైద్య కళాశాలలోని ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన సమావేశం వాడివేడిగా జరిగింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలను సమన్వయ పరుచుకుని చేపట్టిన ముందస్తు చర్యల వల్ల రాష్ట్రంలో డయేరియా వ్యాప్తి నియంత్రణలోకి తీసుకు రాగలిగామని, దీనికి భిన్నంగా ఇటీవల కాలంలో అంటువ్యాధుల ద్వారా మరణాలు సంభవిస్తుండటం ఆందోళనకరమన్నారు. భవిష్యత్తులో ఇటువంటి మరణాలు సంభవించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అంటువ్యాధులు ప్రబలినపుడు అప్రమత్తతతో ఉండాలని ఆదేశించారు. ముఖ్యంగా మలేరియా, డెంగీవ్యాదులపట్ల క్షేత్రస్థాయి వైద్యాధికారులు స్థానికప్రజలకు ఎప్పటికప్పుడు సూచనలు చేస్తుండాలన్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఏజెన్సీ ప్రాంతాలు, సరిహద్దు గ్రామాల చెక్‌పోస్టుల వద్ద వైద్యశిబిరాలు, టెస్టింగ్‌లను అనుమానిత వ్యక్తులకు నిర్వహించాలని ఆదేశించారు. హైరిస్క్ గ్రూపులుగా పరిగణించే కార్మికవర్గాలు అంటువ్యాధులకు గురికాకుండా ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు, సంబంధిత ఏరియాల్లో వ్యాధి నిరోధక రసాయనాలు, కీటకసంహారక మందులను పిచికారీ చేయించాలని సూచించారు. ఏలూరు జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ నాగేశ్వరరావు, రెండు జిల్లాల మలేరియా అధికారులు డాక్టర్ ప్రసాద్, డాక్టర్ రవికుమార్, స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.



ఉపాధ్యాయ సంఘ నాయకులతో జడ్పీ సీఈవో సమావేశం

జడ్పీ పీఎఫ్ బ్యాలెన్స్ షీట్లలో లోపాల దిద్దుబాటుకు హెల్ప్‌డెస్క్ కోసం వినతి

ఏలూరు అర్బన్, ఆగస్టు 14 : ఐదేళ్ళుగా పెండింగ్‌లో వున్న జిల్లా పరిషత్ పీఎఫ్ బ్యాలెన్స్ షీట్లను బుధవారం జడ్పీ అధికారులు ఎట్టకేలకు విడుదల చేశారు. దీనిపై వెంటనే పీఆర్టీయూ జిల్లా నాయకులు ఆంజ నేయులు, సుబ్బారావు స్పందించారు. బ్యాలెన్స్ షీట్లలో మిస్సింగ్ క్రెడిట్లను గుర్తించేందుకు జడ్పీలో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేయాలని, ఆన్‌లైన్‌లో అన్నిరకాల వివరాలు తెలుసుకునేందుకు వీలుగా సంబంధిత వెబ్‌సైట్లు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని అభ్యర్థిస్తూ జడ్పీ సీఈవో, డీఈవోలకు వినతిపత్రాలను అందజేశారు. పీఎఫ్ ఖాతాల నుంచి గరిష్ట రుణ పరిమితిని వైద్య అవసరాలకు రూ.4 లక్షలు, నాన్ రికవరబుల్ రుణాలు రూ.10 లక్షలు మంజూరు చేసేలా పెంచాలని కోరారు. తమ అభ్యర్థనలను పరిశీలిస్తామని అధికారులు హామీ ఇచ్చారని తెలిపారు.



పితాని సూర్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

మంచి మిత్రుడిని కోల్పోయా..

పితానిని పరామర్శించిన మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి

పోడూరు, ఆగస్టు, 14 : చిరకాల మిత్రుడు, ప్రముఖ పారిశ్రామిక వేత్త, విద్యావేత్త పితాని సూర్యనారాయణ మృతితో తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ సోదరుడు పితాని సూర్యనారాయణ ఇటీవల మృతిచెందారు. బుధవారం ఆయన పెదకార్యం సందర్భంగా కిరణ్‌కుమార్ రెడ్డి కొమ్ముచిక్కాల వచ్చారు. పితాని సత్యనారాయణను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. పితాని సత్యనారాయణ కంటే ముందు నుంచి సూర్యనారాయణతో స్నేహ సంబంధాలు ఉన్నాయని గుర్తు చేశారు. పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, పితాని సూర్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ మాజీ సీఎస్ సోమేష్‌కుమార్ తన మిత్రుడు సూర్య నారాయణ లేకపోవడం చాలా బాధాకరమని కన్నీటి పర్యంతం అయ్యారు.

ఉపకులపతి కోసం ఉద్యాన వర్సిటీ ఎదురుచూపు

రెండు నెలలుగా ఎక్కడి ఫైల్స్ అక్కడే

విద్యా సంవత్సరం ప్రారంభంలో అధికారులకు పరీక్ష



తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 14: ఉపకులపతి నియామకం కోసం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఎదురుచూస్తోంది. రెండు నెలలుగా ఉపకులపతి లేక అడ్మినిస్ట్రేషన్ ఫైల్స్ ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. దీనికి తోడు ఫైనాన్స్‌తో ముడిపడిన ఫైల్స్ ఇరుక్కుపోయాయి. ముఖ్యంగా వీసి లేకపోవడంతో ఐసీఏఆర్ నుంచి రావాల్సిన నిధుల రాక ఆలస్యం అవుతోంది. దీంతో కాంట్రాక్టు సిబ్బంది జీతాలు, వర్సిటీ నిర్వహణకు ఇబ్బందులు తప్పడంలేదు. గతంలో ఉపకులపతిగా పనిచేసిన జానకీరామ్ నియామకం చెల్లదంటూ హైకోర్టు తీర్పు ఇవ్వడంతో ఆయన ఇష్టం లేకపోయినా రాజీనామా చేయాల్సి వచ్చింది. దీనికి తోడు గత వైసీపీ పాలనలో ఉద్యాన విశ్వవిద్యాలయ పాలన గతి తప్పి నిద్రావస్థకు చేరుకుందనే విమర్శలు ఉన్నాయి. వీటన్నింటికి చెక్ పెట్టేందుకు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వర్సిటీ ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది.వర్సిటీలో పనిచేసే ఉద్యోగుల్లో ఒకరికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించాలా లేక బయట నుంచి వేరే వారికి ఉపకులపతిగా నియమించాలనా అనే విషయమై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే వర్సిటి అధికారుల్లో సీనియారిటీ కోసం జాబితా సేకరించినా ఆ జాబితాలో ఓ మహిళా అధికారి ఉద్యోగ విరమణ కూడా చేశారు. ఆలస్యం చేయకుండా ప్రభుత్వం వీసీ నియామకంపై నిర్ణయం తీసుకోవాలని వర్సిటీ అధికారులు, విద్యార్థులు కోరుతున్నారు.

క్రైం కార్నర్



తీవ్ర గాయాలైన యువతిని ఆసుపత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది



కారు డ్రైవర్‌ను ప్రశ్నిస్తున్న పోలీసులు

కారు ఢీకొని యువకుడి మృతి

ఏలూరు క్రైం, ఆగస్టు 14 : మోటారు సైకిల్‌పై వెళ్తుండగా ఒక కారు వెనుక నుంచి ఢీకొనడంతో మోటారు సైకిలిస్టు మృతి చెందగా, ఆ మోటారు సైకిల్‌పై ఉన్న యువతి తీవ్ర గాయాలకు గురైంది. పాలకొల్లుకు చెందిన పోతాడ తులసీ వెంకట రవికుమార్ కొంత కాలం నుంచి ఏలూరు అశోక్ నగర్‌లో ఉన్న బంధువుల ఇంటికి వచ్చి ఉంటూ చిన్న చిన్న కాంట్రాక్టు పనులు చేస్తున్నాడు. తన మోటారు సైకిల్‌పై బుధవారం ఉదయం ఏలూరు మెయిన్ బైపాస్‌లో ఆశ్రం వైపు నుంచి విజయవాడ రోడ్డువైపు ఏలూరుకు చెందిన అంజన వైష్ణవి (30) అనే యువతిని ఎక్కించుకుని వెళ్తున్నాడు. చొదిమెళ్ళ బ్రిడ్జి సమీపంలో వెనుక నుంచి ఒక కారు అతి వేగంగా ఢీకొనడంతో మణికుమార్ అక్కడికక్కడే మృతి చెందగా వైష్ణవి తీవ్ర గాయా లకు గురైంది. ఆమెను హైవే అంబులెన్సు సిబ్బంది ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన పశ్చిమ బెంగాల్‌కు చెందిన కారు ఆపకుండా వెళ్ళిపోతుండడంతో రోడ్డు సేఫ్టీ పోలీస్ సిబ్బందికి సమాచారం అందింది. దీంతో కలపర్రు టోల్ ప్లాజా వద్ద తనిఖీలు చేపట్టి ఆ కారును, కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని ఏలూరు రూరల్ పోలీసులకు అప్పగించారు. ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు ఆభరణాలు చోరీ..కేసు నమోదు

టి.నరసాపురం, ఆగస్టు 14: బంగారు ఆభరణాల చోరీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దుర్గామహేశ్వరరావు తెలిపారు. మండలంలోని జగ్గవరం గ్రామానికి చెందిన తెలే కృష్ణ ఈనెల 13న ఇంటికి తాళం వేసి ఉదయం 8 గంటలకు తన భార్యతో కలిసి కూలి పనికి వెళ్ళారు. తిరిగి మధ్యాహ్నం 12.30 నిమిషాలకు ఇంటికి చేరుకున్నారు. ఈ క్రమంలో ఇంటి తాళం కోసి ఉందని, దీంతో ఇంటిలో పలికి వెళ్ళి చూడగా బీరువా పగులగొట్టి బీరువాలో దాచిన రెండు బంగారపు వస్తువులు దొంగలు అపహరించారని బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గోదావరి తీరంలో గుర్తు తెలియని మహిళ మృతదేహం

కుక్కునూరు, ఆగస్టు 14: కుక్కునూరు మండలంలోని దామరచర్ల గోదావరి తీర ప్రాంతంలో గుర్తు తెలియని మహిళ శవం చెట్టుకొమ్మకు వేలాడుతున్నట్లు కుక్కునూరు ఎస్సై రామకృష్ణ బుధవారం తెలిపారు. మెడలో నల్లపూసల దండ ఉన్నట్లు తెలిపారు. వివరాలకు కుక్కునూరు పోలీస్‌స్టేషన్‌లో 73826 23699 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

ఉంగుటూరు ఆగస్టు 14 : జాతీయ రహదారిపై ఉంగుటూరు వద్ద బైక్‌ను వెనుక నుంచి కారు ఢీకొన్న సంఘటనలో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. బుధవారం సాయంత్రం ద్వారకాతిరుమల నుంచి తాడేపల్లిగూడెం వైపు వెళ్తున్న ఆల్టో కారు ముందు వెళ్తున్న మోటారు సైకిల్‌ను ఢీకొట్టింది. బైక్‌పై ప్రయాణిస్తున్న భీమడోలు మండలం పూళ్ల గ్రామానికి చెందిన నాగార్జున, సతీష్‌లు గాయపడ్డారు. వీరిలో ఒకరికి తలకు తీవ్ర గాయం కావడంతో అంబులెన్స్‌లో ప్రవేటు ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ మణికుమార్ తెలిపారు.

ఆటో తిరగబడి డ్రైవర్ మృతి



భీమవరం క్రైం, ఆగస్టు 14 : ప్రమాదవశాత్తు ఆటో తిరగబడి ఒక వ్యక్తి చనిపోయినట్లు భీమవరం టూటౌన్ పోలీసులు చెప్పారు. వీరవాసరం గ్రామానికి చెందిన చింతా చందు (29) భీమవరం పట్టణంలోని చినరంగనిపాలెంలో నివాసముంటూ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం తాడేపల్లిగూడెం నుంచి భీమవరం వస్తుండగా దుర్గాపురం వద్ద ప్రమాదవశాత్తు ఆటో తిరగబడి మృతి చెందాడు. మృతుడు భార్య సుజాత ఇచ్చిన పిర్యాదు మేరకు సీఐ కాళీచరణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య

నూజివీడు టౌన్, ఆగస్టు 14: మైక్రో ఫైనాన్స్ కంపెనీల ఏజెంట్ల వేధింపులతో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నూజివీడు మండలం ముక్కొల్లుపాడులో చోటు చేసుకుంది. ముక్కొల్లుపాడుకు చెందిన తమ్మిశెట్టి సక్కమ్మ (40) పలు ప్రైవేటు మైక్రో ఫైనాన్స్ సంస్థల నుంచి సుమారు రూ. 3 లక్షల వరకు రుణం తీసుకుంది.వర్షాల కారణంగా పనులు లేక రుణ వాయిదాలు చెల్లించడంలో సక్కమ్మ విఫలమైంది. రుణం చెల్లించాల్సిందిగా ఏజెంటు నుంచి ఒత్తిడి రావడంతో వేధింపులు భరించలేక బుధవారం సాయంత్రం తన ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సక్కమ్మ భర్త రాజు సమాచారాన్ని బంధువులకు, పోలీసులకు తెలియజేయడంతో సక్కమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భర్త ,అత్తమామలపై కేసు నమోదు

ఉండి ఆగస్టు 14: భర్త, అత్తమామలు వేధింపులకు గురి చేస్తున్నారంటూ భార్య అరుణకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం రాత్రి పోలీసులు అందించిన వివరాలు ఇవి. ఉండి మండలం మహదేవపట్నం గ్రామానికి చెందిన అరుణకుమారికి, కుమార్ రాజులకు 2005లో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. భర్త, అత్త మామలు తనను వేధిస్తున్నారంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ద్వారకాతిరుమల, ఆగస్టు 14: యువతి అదృశ్యంపై ద్వారకాతిరుమల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి మంగళవారం రాత్రి అందరూ ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. ఉదయం లేచి చూసేసరికి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లల్లో వెదికినా ఫలితం లేకపోయేసరికి వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



సీజ్ చేసిన పురుగు మందులతో విజిలెన్స్ అధికారులు

విజిలెన్స్ దాడి..ఎరువులు, పురుగు మందు సీజ్

ముసునూరు, ఆగస్టు 14: ముసునూరులోని శ్రీ అమృత ట్రేడర్స్‌లో ఎరువులు, పురుగు మందుల అక్రమ నిల్వలున్నట్టు అందిన సమాచారం మేరకు విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు బుధవారం దాడి చేశారు. విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ పి.శివరామకృష్ణ, ఏవో పి.సురేష్, వ్యవసాయ ఏవో ఎస్.మధుమోహన్‌లు దుకాణంలో తనిఖీలు నిర్వహించి రూ. 23,68,485ల విలువ కలిగిన 16.121 మెట్రిక్ టన్నుల ఎరువుల్లో వ్యత్యాసాన్ని గుర్తించి సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు. అలాగే రూ.1,64,800 విలువైన నిషేధిత కలుపు మందును సీజ్ చేసి కోర్టులో క్రిమినల్ కేసు నమోదు చేసినట్టు విజిలెన్స్ అధికారులు తెలిపారు.

మహాత్మా.. మన్నించు



నాలుగేళ్లుగా విరిగిన చేతితో జాతిపిత విగ్రహం

ముదినేపల్లి, ఆగస్టు 14 : దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిపెట్టిన గాంధీజీ విగ్రహాలు పాడైపోతున్నా పట్టించుకోవడం లేదు. ముదినేపల్లి మండలం అన్నవరం గ్రామంలో విరిగిన చెయ్యి, చేతిలో కర్ర లేకుండా ఏళ్ల తరబడి గాంధీ విగ్రహం ఉంది. 1947లో స్వాతంత్ర్యం రాగానే అన్నవరం గ్రామంలో కొత్తూరు వెంకటాద్రి, కొత్తూరు రామనాథం, ముప్పవరపు రాధాకృష్ణమూర్తి, గ్రామస్థులు ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. నాలుగు సంవత్సరాలుగా మొండి చెయ్యితో ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. మహాత్మా.. మన్నించు.

ఏపీ నిట్‌కు విదేశీ విద్యార్థులు

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 14 : తాడేపల్లిగూడెం ఏపీ నిట్‌కు విదేశీ విద్యా ర్థులు పోటెత్తుతున్నారు. ఈ ఏడాది బీటెక్‌లో ప్రవేశానికి 250 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక, తదితర దేశాల నుంచి ఏపీ నిట్‌లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. విదేశీ విద్యార్థుల కోసం ఏపీ నిట్‌లో 20 సీట్లు కేటాయించారు. గతంలో కేంద్ర ప్రభుత్వమే విదేశీ విద్యార్థుల కోసం సీట్లు కేటాయించేది. అడ్మిషన్లు నిర్వహించేది. ఇప్పుడు ఆ బాధ్యతను ఏపీ నిట్‌కు అప్ప గించారు. విదేశీ విద్యార్థుల కోసం అంతర్జాతీయ స్థాయిలో హాస్టల్ వసతి సదు పాయాలు ఏర్పాటు చేశారు. విద్యార్థుల అర్హతను బట్టి అడ్మిషన్లు కల్పించనున్నారు.

క్రైం సమాచారం

వివాహిత ఆత్మహత్య

మైక్రో ఫైనాన్స్ వేధింపులే కారణం?



సక్కమ్మ (ఫైల్)

నూజివీడు టౌన్, ఆగస్టు 14: మైక్రో ఫైనాన్స్ కంపెనీల ఏజెంట్ల వేధింపులతో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నూజివీడు మండలం ముక్కొల్లుపాడులో చోటు చేసుకుంది. ముక్కొల్లుపాడుకు చెందిన తమ్మిశెట్టి సక్కమ్మ (40) పలు ప్రైవేటు మైక్రో ఫైనాన్స్ సంస్థల నుంచి సుమారు రూ. 3 లక్షల వరకు రుణం తీసుకుంది. ఈ రుణం ఇప్పించడంలో ముక్కొల్లుపాడు గ్రామానికి చెందిన ఒక మహిళ ఏజెంటుగా వ్యవహరించగా గత నెలలో భారీ వర్షాల కారణంగా పనులు లేక రుణ వాయిదాలు చెల్లించడంలో సక్కమ్మ విఫలమైంది. దీంతో రుణ వాయిదాలు చెల్లించాల్సిందిగా ఏజెంటు నుంచి తీవ్ర ఒత్తిడి రావడంతో వేధింపులు భరించలేక బుధవారం సాయంత్రం తన ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సాయంత్రం ఇంటికి వచ్చిన సక్కమ్మ భర్త రాజు సమాచారాన్ని బంధువులకు, పోలీసులకు తెలియజేయడంతో సక్కమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలతో..

లక్ష్మీభవాని ఆచూకీ కోసం ముమ్మర గాలింపు

ముదినేపల్లి, ఆగస్టు 14 : ముదినేపల్లిలో ఈ నెల 8న అదృశ్యమైన వివాహిత కోన మహాలక్ష్మి భవానీ (32) ఆచూకీ కోసం పోలీసుల అధికారులు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. విషయం డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి వెళ్లటం, ఆయన దర్యాప్తు వేగవంతం చేయాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించటంతో పోలీసు వర్గాల్లో మరింత కదలికను తెచ్చింది. మంగళవారం పవన్ కల్యాణ్‌ను భవానీ భర్త, సోదరుడు గన్నవరం విమానాశ్రయంలో కలసి లక్ష్మీభవాని అదృశ్యమైన విషయాన్ని వివరించారు. ముదినేపల్లి నుంచి విజయవాడ చేరి అక్కడ రెండు రోజులపాటు ఉన్నట్లు ముదినేపల్లి పోలీసులు సిసి కెమెరాల పుటేజీల ద్వారా గుర్తించారని, అనంతరం ఎక్కడికి వెళ్లిందో తెలియటం లేదని పవన్ కళ్యాణ్‌కు చెప్పారు. అయితే ఆమె హైదరాబాద్ వెళ్లినట్లు సమాచారం ఉందని కూడా ఆమె సోదరుడు తెలిపారు. దీంతో లక్ష్మీభవానీ ఆచూకీ కనుగొనేందుకు చర్యలు వేగవంతం చేయాలని డిప్యూటీ సీఎం జిల్లా ఎస్పీని ఆదేశించటంతో బుధవారం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. హైదరాబాద్‌లో ఉన్నట్లు సమాచారం సేకరించారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు

ముసునూరు, ఆగస్టు 14: పొలంలోకి అక్రమంగా ప్రవేశించి, భార్యాభర్తలపై దాడిచేసిన వ్యక్తిపై బుధవారం ముసునూరు ఎస్‌ఐ పి.వాసు కేసు నమోదు చేశారు. మండలంలోని గుళ్ళపూడి గ్రామానికి చెందిన కందుల ఏడుకొండలు దంపతులు గత నెల 30న తమ పొలంలో వరినాట్లు వేసుకుంటుండగా సరిహద్దులో ఉన్న చీపు వెంకటేశ్వరరావు అనే వ్యక్తి ఈ భూమి తనదని, దంపతులపై దాడి చేశాడు. వెంకటేశ్వరరావుతో తమకు ప్రాణహాని ఉందని లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వాసు తెలిపారు.





కైకలూరులో బీటలు వారిన ఓవర్‌హెడ్ ట్యాంక్

బీటలు వారి.. పెచ్చులూడి

శిథిలావస్థలో రక్షిత మంచినీటి పథకం

పట్టించుకోని అధికారులు, పాలకులు

ఆందోళనలో ప్రజలు

కైకలూరు, ఆగస్టు 14: కొరవడిన అధికారుల పర్యవేక్షణ, నాణ్యతా ప్రమాణాలు పాటించక పోవడంతో కోట్లాది రూపాయలతో నిర్మించిన రక్షిత నీటి పథకాలు అనతి కాలంలోనే శిథిలావస్థకు చేరుతున్నాయి. చిన్నపాటి మరమ్మతులకు సైతం నోచుకోకపోవడంతో కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఇనుప ఊచలు పూర్తిగా బయట పడడంతో ఓవర్ హెడ్ ట్యాంకులను చూసిన ప్రజలు, ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్‌లను తొలగించడంలో కూడా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఏ సమయంలోనైనా కూలి పోయేందుకు సిద్ధంగా ఉన్న వాటిని కూడా తొలగించడం లేదు. కైకలూరులో సుమారు 30 వేల మంది జనాభా నివశిస్తున్నారు. తాగునీరు సరఫరా చేసేందుకు కైకలూరు భవానమ్మ చెరువుగట్టుపై 3 ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించారు. వాటిలో 60 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంక్ బీటలు వారి ఐరన్ ఊచలు బయటపడ్డాయి. కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొన్నప్పటికీ అధికారులు వాటిని పట్టించుకున్న దాఖలాలు లేవు. ట్యాంక్ చుట్టూ భారీ కొబ్బరి చెట్లు ఉండడంతో ఈదురు గాలుల సమయంలో చెట్లు విరిగి ట్యాంక్‌పై పడే ప్రమాదం పొంచి ఉంది. చెట్లు ట్యాంక్‌పై పడినా ట్యాంక్‌లు కూలిపోతాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రహదారి వెంబడి ప్రజలు, వాహనదారులు ప్రయాణిస్తుంటారు. చిన్నచిన్న దుకాణదారులు, ఆటో వర్కర్లు ట్యాంక్ సమీపంలోనే ఎక్కువ సమయం గడుపుతూ ఉంటారు. ప్రమాదం జరగకముందే అధికారులు మేల్కొనాలి.

నిధులు మంజూరు చేశాం..

కైకలూరులోని నాలుగు ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల మరమ్మతుల కోసం ప్రతిపాదనలు చేశాం. ఇనుప ఊచలు బయటపడిన 60 వేల లీటర్ల వాటర్ ట్యాంక్ మరమ్మతుల కోసం రూ.2 లక్షల నిధులు మంజూరు చేశాం. త్వరలోనే పంచాయతీ ద్వారా పనుల నిర్వహిస్తాం.

-బి. నాగబాబు, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, కైకలూరు







ముసునూరు, కైకలూరులో మువ్వన్నెల జెండాలతో ర్యాలీలు

నేడే స్వాతంత్ర్య దినం..

» త్రివర్ణ పతాకాలతో ర్యాలీలు » ఆగిరిపల్లిలో 150 అడుగుల భారీ జెండాతో ర్యాలీ

ఆగిరిపల్లి, ఆగస్టు 14: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగిరిపల్లి భాగ్యలక్ష్మి ఇండేన్ గ్యాస్ నిర్వాహకుడు పాలడుగు శ్రీనివాస్ 150 అడుగుల త్రివర్ణ పతాకంతో ఆగిరిపల్లి జడ్పీ హైస్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో-2 ఆనంద్‌కుమార్, ప్రిన్సిపాల్ పులి పుష్పలత, బీజేపీ నూజివీడు నియోజకవర్గ కన్వీనర్ రంగారావు, మండల అధ్యక్షుడు కొవ్వలి బాబూరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముసునూరు: జాతీయ సమైక్యతను చాటిచెప్పేందుకు ప్రధాని మోదీ హర్ ఘర్ తిరంగా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎంఈవో సుబ్బారావు, ఎంపీడీవో కార్యాలయ పరిపాలన అధికారి కె.సాయిరాము అన్నారు. బుధవారం ముసునూరులో అధికారులు, విద్యార్థులు జాతీయజెండాలతో ర్యాలీ నిర్వహించారు. స్వాతంత్ర దినోత్సవం రోజు ప్రతి ఇంటిపై జాతీయజెండా ఎగురవేయాలని ఎంఈవో అన్నారు. ఈ ర్యాలీలో పంచాయతీ కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు, మహిళా పోలీస్‌లు సంధ్య, భవాని, సీనియర్ అసిస్టెంట్ ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కైకలూరు: విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించడానికి హర్ ఘర్ తిరంగా ర్యాలీ ఎంతో ఉపయోగపడుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సుజాత అన్నారు. బుధవారం కైకలూరు వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ యూనిట్, యూత్ క్రాస్ యూనిట్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటిపైన జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు. అధ్యాపక బృందం ఎం. విజయ కుమార్, డాక్టర్ ఎం. హరిప్రసాద్, మన్నె శివనాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ దాడులు

ఎరువులు, నిషేధిత పురుగు మందు సీజ్



ముసునూరు, ఆగస్టు 14: ముసునూరులోని శ్రీ అమృత ట్రేడర్స్‌లో ఎరువులు, పురుగు మందుల అక్రమ నిల్వలున్నట్టు అందిన సమాచారం మేరకు విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు బుధవారం దాడి చేశారు. విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ పి.శివరామకృష్ణ, విజిలెన్స్ ఏవో పి.సురేష్, వ్యవసాయ ఏవో ఎస్.మధుమోహన్‌లు దుకాణంలో విస్తృత తనిఖీలు నిర్వహించి రూ. 23,68,485ల విలువ కలిగిన 16.121 మెట్రిక్ టన్నుల ఎరువుల్లో వ్యత్యాసాన్ని గుర్తించి సీజ్ చేసి కేసు నమోదు చేశామని, అలాగే రూ.1,64,800 విలువైన నిషేధిత కలుపు మందును సీజ్‌చేసి కోర్టులో క్రిమినల్ కేసు నమోదు చేసినట్టు విజిలెన్స్ అధికారులు తెలిపారు.



స్వచ్ఛందంగా రహదారి మరమ్మతులు

కలిదిండి, ఆగస్టు 14 : అధ్వానంగా ఉన్న యడవల్లి-పెదలంక ప్రధాన రహదారికి రైతులు రూ.4 లక్షల విరాళాలతో బుధవారం స్వచ్ఛందంగా మరమ్మతు పనులు ప్రారంభించారు. రహదారిపై పడిన గోతులను ఎక్స్‌వేటర్‌తో చదును చేసి కంకరతో పూడ్చుతున్నారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా యడవల్లి నుంచి పెదలంక వరకు ఆరు కిలోమీటర్ల మేర రోడ్డు మరమ్మతులు చేస్తున్నామని రైతులు తెలిపారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పిలుపు మేరకు రైతులు స్వచ్ఛందంగా రహదారి మరమ్మతులు చేపట్టడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆక్వా రైతులు ముద్దం భోగేశ్వరరావు, అంల్రాజు శ్రీనివాస్, దున్న భోగేశ్వరరావు, నాగిడి వీరబ్రహ్మం, తిరుమాని రంగారావు, దుగ్గిరాల ఆంజనేయులు, అక్కల బోసు, బొమ్మిడి ధనరాజ్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో సమస్యల పరిష్కారం



ముసునూరు, ఆగస్టు 14: ముసునూరు గురుకుల బాలికల పాఠశాలలో డీఈవో ఎస్.అబ్రహం ఆకస్మిక తనిఖీతో సమస్యల పరిష్కారానికి ప్రిన్సిపాల్ కె.ప్రవీణ చర్యలు చేపట్టారు. పాఠశాల ప్రాంగణంలో పిచ్చిమొక్కలను బుధవారం తొలగించి, పచ్చగడ్డిని నివారించేందుకు గడ్డి మందును పిచికారీ చేయించారు. వంటశాలలో కుళ్లిన కూరగాయలు గుర్తించిన డీఈవో వార్డెన్, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం విదితమే. కూరగాయలు స్టోర్ చేసే గదిలో ఫ్యాన్‌ను బిగించారు. పనులను పాఠశాల ప్రిన్సిపాల్ ప్రవీణ, ఎస్ఎంసీ చైర్మెన్ ఎస్.పంగిడియ్య పర్యవేక్షించారు. కూరగాయల స్టోరేజ్‌పై తగు జాగ్రత్తలను తీసుకోవాలని, మెనూ ప్రకారం భోజనం నాణ్యత, రుచితో ఉండాలని వీటిపై ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని వంట సిబ్బంది, వార్డెన్‌ను ప్రిన్సిపాల్ హెచ్చరించారు.

ఉపాధ్యాయుడి చొరవతో అభివృద్ధి పనులు



ముసునూరు, ఆగస్టు 14: ముసునూరు జడ్పీ పాఠశాల ఆవరణలో వర్షపునీరు నిల్వ ఉండటం, బురదమయంగా మారటంతో విద్యార్థుల ఇబ్బందిని గుర్తించిన గణిత ఉపాధ్యాయుడు గంగుల నాగేశ్వరరావు రూ. 8 వేలు ఖర్చుచేసి పాఠశాల ఆవరణను మట్టితో పూడ్చి, డోజర్‌తో బుధవారం చదును చేయించారు. దీంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దాత నాగేశ్వరరావును హెచ్ఎం సునీల, సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి : ఎస్ఐ



ముదినేపల్లి, ఆగస్టు 14 : ముదినేపల్లి వికాస్ జూనియర్ కళాశాలలో పోలీస్ శాఖ బుధవారం పలు చట్టాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించింది. సైబర్ క్రైం, డ్రగ్స్ వినియోగం, ర్యాగింగ్, సమాజ శాంతికి భంగం కలిగించే కార్యకలాపాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ముదినేపల్లి ఎస్ఐ దేశింశెట్టి వెంకట్ కుమార్ తెలిపారు. విద్యార్థులు డ్రగ్స్‌కు అలవాటు పడితే తమ భవిష్యత్తును తామే నాశనం చేసుకున్నట్టవుతుందని, గంజాయికి బానిసలు కావద్దని కోరారు. ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన శిక్షలకు గురవుతారని హెచ్చరించారు. కళాశాల కరస్పాండెంట్ టీవీ రావు, ప్రిన్సిపాల్ మోహన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరి నాట్లపై రైతులకు అవగాహన



ముదినేపల్లి, ఆగస్టు 14 : వ్యవసాయ శాఖ సింగరాయపాలెంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించింది. వరి సాగులో అనుసరించాల్సిన వివిధ యాజమాన్య పద్ధతులను అధికారులు రైతులకు వివరించారు. ఈ సందర్భంగా మండవల్లి ఏడీఏ జి.వెంకటమణి ఆధ్వర్యంలో "గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీస్" కార్యక్రమాన్ని నిర్వహించి పొలం బడి సూత్రాలపై రైతులకు అవగాహన కల్పించారు. 14 వారాలపాటు పొలంబడి నిర్వహిస్తామని ముఖ్యంగా సస్యరక్షణపై రైతులకు శిక్షణ ఇస్తామని తెలిపారు. ఏవో వేణుమాధవ్, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



కాలినడకన బ్రహ్మంగారి మఠానికి..

ముదినేపల్లి, ఆగస్టు 14 : మం డలంలోని పెద కామనపూడికి చెందిన టీడీపీ నాయకుడు పెరు మాళ్ల సత్యనారా యణ చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే నంద్యాల జిల్లా బ్రహ్మంగారి మఠానికి కాలినడకన వస్తానని మొక్కుకున్నాడు. తన కోర్కె నెరవేరటంతో బుధవారం ఉదయం ముదినేపల్లిలోని భక్తాంజనేయస్వామి దేవస్థానం నుంచి బ్రహంగారి మఠానికి కాలినడకన బయలు దేరారు. ఆయనను టీడీపీ నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ కన్వీనర్ కొడాలి వినోద్, పార్టీ నాయకుడు బత్తుల రవి తదితరులు అభినందించారు.

తాగునీటి చెరువులను పూర్తిగా నింపాలి



గుర్వాయిపాలెం వద్ద సీబీ కెనాల్‌ను పరిశీలిస్తున్న మాజీ ఎంపీపీ, టీడీపీ నాయకులు

కలిదిండి, ఆగస్టు 14 : అడుగంటిన తాగునీటి చెరువులను పూర్తిగా నింపాలని మాజీ ఎంపీపీ బండి లక్ష్మీ తులసీరావు, టీడీపీ నాయకులు ఇరిగేషన్ అధికారులను కోరారు. బుధవారం గుర్వాయిపాలెం లాకుల వద్ద సీబీ కెనాల్‌లో తగ్గిన వాటర్ లెవల్‌ను పరిశీలించారు. ప్రస్తుతం మూల్లంకలో అడుగంటిన తాగునీటి చెరువును నింపటానికి నీటి వంతు ఇచ్చారని చెరువు పావు వంతు మాత్రమే నిండిందన్నారు. కాల్వలోకి తాగునీటి వంతు రాకపోవటంతో మోటార్ పంపు సెట్‌లను నిలుపుదల చేశామన్నారు. సీబీ కెనాల్‌లో వాటర్ లెవల్ పడిపోవటం వల్లే మూల్లంక కాల్వకు తాగునీరు సరఫరా కావటం లేదన్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ ఉన్నతాధికారులు స్పందించి వాటర్ లెవల్‌ను పూర్తిస్థాయిలో పెంచి తాగునీటి చెరువులను నింపాలన్నారు. టీడీపీ నాయకులు బోళ్ల ఏడుకొండలు, వేగిరెడ్డి చిన్నారావు, చొక్కాపుల జయకుమార్ పాల్గొన్నారు.

మంత్రి చొరవతో జంగిల్ క్లియరెన్స్



ముసునూరు, ఆగస్టు 14: గోపవరం పంచాయతీలో దీర్ఘకాల సమస్యలు నూజివీడు మంత్రి కొలుసు పార్థసారథి చొరవతో పరిష్కారమవుతున్నాయి. పంచాయతీ పరిధిలోని శ్మశానవాటికల్లో తుప్పల తొలగింపు పనులను టీడీపీ నాయకులు బుధవారం ప్రారంభించారు. మంత్రి పార్థసారథి సహకారంతో వనసంరక్షణ నిధులతో శ్మశానవాటికల్లో ఉన్న ముళ్ళకంచెల తొలిగింపు ప్రక్రియను చేపట్టినట్లు టీడీపీ యువనేత ఉప్పలపాటి గణేష్ తెలిపారు. అలాగే మంత్రి ఆదేశాలతో బీసీ, ఎస్సీ కాలనీల్లో అంతర్గత రహదారులు, డ్రైనేజీల అభివృద్ధికి, నూతన మంచినీటి ట్యాంక్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారుచేయడం జరిగిందన్నారు. ఇటీవల గోపవరం వచ్చిన మంత్రి దృష్టికి స్థానికులు తీసుకువచ్చిన ప్రతి సమస్యకు నిధులు కేటాయించి పరిష్కారిస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు గణేష్ తెలిపారు. పార్టీ గ్రామ అధ్యక్షులు బొల్లినేని బుజ్జియ్య, ఉపాధ్యక్షులు పర్వతనేని శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్, సులభ్ కాంప్లెక్స్ నిర్మిస్తా



ఇన్‌చార్జి ఎంపీడీవోకు మహేశ్వరరావు వినతిపత్రం

చాట్రాయి, ఆగస్టు 14: మండలంలోని చనుబండ సెంటర్‌లో ప్రభుత్వం స్థలం కేటాయిస్తే, తాను బస్‌షెల్టర్, సులభ్ కాంప్లెక్ నిర్మించి ఇస్తానని స్థానిక హోటల్ యజమాని బజ్జూరి మహేశ్వరరావు ఇన్‌చార్జి ఎంపీడీవో మురళీమోహన్‌కు, తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాలు అందజేశారు. పది గ్రామాలకు కూడలి అయిన చనుబండలో బస్‌షెల్టర్, టాయిలెట్స్ లేక మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో చనుబండ హిందూ శ్మశాన వాటికలో తాను కర్మల షెడ్డు నిర్మించి, స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేయించానని అక్కడ పందులు, పశువులను వధించడం వల్ల అపరిశుభ్రత తాండవిస్తున్నదని అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని మహేశ్వరరావు వినతిపత్రంలో కోరారు. బీజేపీ జిల్లా నాయకుడు నెక్కలపు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎంపీడీవో దుర్గాప్రసాద్‌కు సత్కారం



చాట్రాయి, ఆగస్టు 14: చాట్రాయి ఎంపీడీవోగా దుర్గాప్రసాద్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఆయన ఎన్నికల కమీషన్ ఆదేశాలతో 6 నెలల క్రితం గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యి, మళ్ళీ బదిలీపై వచిన ఎంపీడీవో దుర్గాప్రసాద్‌ను ఏవో మురళీమోహన్, పంచాయతీ కార్యదర్శులు నాగరాజు, నిషాక్ అలీ, లక్ష్మీనారాయణ సత్కరించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు అందించటానికి కృషి చేస్తానన్నారు.

పంట కాలువల్లో చెత్త తొలగింపు



కైకలూరు, ఆగస్టు 14: పంట కాలువల్లో చెత్త తొలగింపు పనులను యుద్ధప్రాతిపాదికన నిర్వహిస్తున్నారు. బుధవారం కైకలూరు మండలం ఆలపాడు గ్రామంలో పంట కాలవల్లో కూలీలతో చెత్తతొలగింపు పనులను నిర్వహిస్తున్నారు. అలాగే పోల్‌రాజ్ పంటకాలువలో తాడినాడ, కొండూరు గ్రామాల్లో ఎక్స్‌కవేటర్లతో చెత్త తొలగింపు పనులను నిర్వహిస్తున్నారు. జలవనరుల శాఖ ఏఈ రాజగోపాల్ పనులను పరిశీలించారు. అలాగే కైకలూరు ప్రాంతంలో మిగిలిన పంటకాలువల్లో చెత్త తొలగింపు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కైకలూరు పంట కాలువలో చెత్త తొలగిస్తే ఆలపాడు, పల్లెవాడ గ్రామాల్లోని మంచినీటి చెరువులకు పూర్తిస్థాయిలో నీరు అందుతుందన్నారు.

మిషన్ లెర్నింగ్‌తో ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ చంద్రశేఖర్

నూజివీడు టౌన్, ఆగస్టు 14: మిషన్ లెర్నింగ్‌ను అర్థం చేసుకోవడం వల్ల సాంకేతికతలను అందిపుచ్చుకుని భవిష్యత్‌లో ఉపాధి అవకాశాలను మెరుగు పర్చుకోవచ్చని నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఎం. చంద్రశేఖర్ అన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో 2024-25 విద్యా సంవత్సరం నుంచి మిషన్ లెర్నింగ్‌లో మైనర్ డిగ్రీ ప్రోగ్రాంను ఆయన బుధవారం ప్రారంభించి మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణ, ఆటోమోటివ్, వినోదం వంటి అనేక పరిశ్రమల్లో ఈ మిషన్ లెర్నింగ్ ఉపయోగపడుతుందన్నారు. సంబంధిత రంగాల్లో నైపుణ్యం పొందేందుకు డిగ్రీ ప్రోగ్రాంను నాలుగు సెమిస్టర్లలో ఐదు కోర్సులుగా అందిస్తున్నామన్నారు. 70 సీట్లలో అందిస్తున్న ఈ ప్రోగ్రాంకు 291 మంది రిజిస్టర్ చేసుకున్నారని ప్రతిభ ఆధారంగా ఎంపిక ఉంటుందన్నారు. డీన్ ఆఫ్ అకాడమిక్స్ ఎన్.రత్నాకర్, స్టూడెంట్ వెల్ఫేర్ ఆఫీసర్లు, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

నూజివీడు బాలికల ప్రతిభ





నిఖిల, కవిత

నూజివీడు టౌన్, ఆగస్టు 14: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహిం చిన వ్యాస రచన, వక్తృత్వ పోటీల్లో నూజివీడు బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల హెచ్.ఎం వీణారాణి తెలిపారు. వ్యాస రచన పోటీల్లో టెన్త్ విద్యార్థిని ఎస్.కవిత జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం, డిబేట్‌లో సీహెచ్ నిఖిల రెండో స్థానం సాధించినట్లు ఆమె తెలిపారు.

పాడి రైతులకు బోనస్



చాట్రాయి, ఆగస్టు 14: మండలంలోని తుమ్మగూడెం పాల సహకార సంఘంలోని పాడి రైతులకు కృష్ణా మిల్క్ యూనియన్ 2025-25 ఆర్థిక సంవత్సరం మొదటి విడత బోనస్‌గా రూ 3.46 లక్షలను బుధవారం క్లస్టర్ మేనేజర్ సాంబశివమూర్తి, సంఘం అధ్యక్షురాలు మందలపు పద్మావతి పంపిణీ చేశారు. సూపర్‌వైజర్ శివ నాగేశ్వరరావు, వేతన కార్యదర్శి సత్యనారాయణ, పాడి రైతులు పాల్గొన్నారు.

ముద్దరబోయిన పరామర్శ



ఆగిరిపల్లి, ఆగస్టు 14: పిన్న మరెడ్డిపల్లికి చెందిన నియోజకవర్గ టీడీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి జెన్నీ రాంబాబు తండ్రి రామారావు అనారోగ్యంతో మరణించడంతో బుధవారం మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు రామారావు కుటుంబాన్ని పరామర్శించారు. టీడీపీ ఏలూరు జిల్లా ఉపాధ్యక్షుడు కొండా మంగయ్య, ఆగిరిపల్లి మండల ఉపాధ్యక్షుడు గండికోట రంగారావు, మల్లవల్లి కన్నయ్య, తెలుగు యువత నాయకులు యలమర్తి భవానిశంకర్, చోడవరపు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తోటపల్లిలో వైద్య శిబిరం



ఆగిరిపల్లి, ఆగస్టు 14: తోటపల్లిలో సగ్గూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. తోటపల్లి గ్రామస్థులు ఒళ్లు నొప్పులు, జ్వరాల తో బాధపడుతుండటం, ప్రైవేట్ వైద్యంతో వేల రూపాయలు ఖర్చు చేస్తున్నా ఆర్థిక భారం తప్ప జ్వరాల తగ్గకపోవడంతో వైద్య శిబిరం నిర్వహించినట్టు టీడీపీ నూజివీడు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ఆరేపల్లి శ్రీను అన్నారు. ఏఎన్ఎం సునీత, ఎంఎల్‌హెచ్‌పి గాయత్రి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మురికి కూపాలుగా రహదారులు

ఆగిరిపల్లి, ఆగస్టు 14: జీతాలు సరిగా ఇవ్వడం లేదంటూ పంచాయతీ పారిశుధ్య కార్మికులు విధులు నిర్వహించకపోవడంతో రహదారులన్నీ మురికి కూపాలుగా మారాయి. మెయిన్ రోడ్డు కూడా సరైన నిర్వహణ లేక ఎక్కడ చెత్త అక్కడే ఉండి దుర్గంధం వెదజల్లుతోంది. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా వర్కర్లతో సంప్రదించి వీధులను శుభ్రం చేయిస్తామని తెలిపారు.